J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 16

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS




# లాయర్

సంపుటి : 45 సంచిక : 46 17.4.2026, శుక్రవారం వెల : రూ. 10/- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి



# ఇక ప్రతివారం.. 'పల్లె వీక్షణం'

## సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన కలెక్టర్ హిమాన్షు శుక్ల



అంగన్‌వాడీ చిన్నారులతో ముచ్చటిస్తున్న జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల

**ఇక ప్రతివారం 'పల్లెవీక్షణం' కార్యక్రమం నిర్వహించి ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని పరిష్కరించేందుకు జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్ల సమాయత్త మయ్యారు. తొలుత ఆయన ఈనెల 15న ఆత్మకూరు మండలం నబ్బీ నగరం, బోయిల చిరువెళ్ల గ్రామాల నుంచి పల్లె వీక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రతి సమస్యకు పరిష్కారం చూపడమే లక్ష్యంగా కలెక్టరే స్వయంగా 'పల్లె వీక్షణం' ద్వారా సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టడంతో ప్రజల్లో సంతోషం వ్యక్తమవుతోంది.**

జిల్లా అధికార యంత్రాంగంతో కలిసి కలెక్టర్ హిమాన్షు శుక్లా గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలును క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు సంకల్పించారు. ఇందులో భాగంగా, బోయిల చిరువెళ్ల గ్రామంలో రైతు సేవా కేంద్రం, విలేజ్‌హెల్త్ క్లినిక్, అంగన్వాడీ కేంద్రం, హౌసింగ్‌కాలనీ, మినీ గోకులం వంటి పలు ప్రాంతాలను కలెక్టర్ సందర్శించారు. నబ్బీనగరం గ్రామంలో ఉపాధిహామీ పనుల వద్దకు వెళ్లి కూలీలతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. గ్రామ వీధుల్లో నడుచుకుంటూ ప్రజలతో మమేకమై సమస్యలను తెలుసుకుని, వాటిని వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, స్థానిక అధికారుల పనితీరుపై ఆరా తీశారు. తొలుత, రైతు సేవా కేంద్రంలో రైతులతో మాట్లాడిన కలెక్టర్, మొదటిపంట ధాన్యాన్ని మద్దతు ధర కంటే ఎక్కువగా విక్రయించడం సంతోషకరమని పేర్కొన్నారు. త్వరలోనే సాగునీటి సలహా మండలి సమావేశం నిర్వహించి జిల్లాలో రెండో పంటకు సాగునీటి విడుదలపై నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

### చిన్నారులతో ముచ్చటించిన కలెక్టర్ :

అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ చిన్నారులతో ముచ్చటించారు. వారి అభ్యసన సామర్థ్యాలను నేరుగా పరిశీలించారు. పిల్లలకి అందిస్తున్న ఆహారం, పిల్లల హాజరు నమోదు, బరువు, ఎత్తు మొదలైన విషయాలను తెలుసుకున్నారు. చిన్నారులను కంటికిరెప్పలా కాపాడుకుంటూ విద్యాబుద్ధులు నేర్పించాలని అంగన్‌వాడీ నిర్వాహకులకు సూచించారు. జిల్లా పరిషత్ సీఈఓ శ్రీధర్‌రెడ్డి, డిపిఓ వసుమతి, జిల్లా వ్యవసాయ అధికారి సత్యవాణి, డిఎం అండ్ హెచ్‌వో డాక్టర్ సుజాత, ఐసిడిఎస్ పీడీ హేనాసుజన్, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఇ విజయభాస్కర్, అధికారులు పాల్గొన్నారు.

# ఇంటర్‌లో సత్తా చాటిన..అమ్మాయిలు!

**రాష్ట్రప్రభుత్వం బుధవారం విడుదల చేసిన ఇంటర్‌మీడియట్ పరీక్షల ఫలితాల్లో అమ్మాయిలు తమ సత్తాచాటారు. జూనియర్, సీనియర్ ఇంటర్‌లు రెండింటిలోనూ బాలికలదే ప్రతిభ అని నిరూపించుకున్నారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 78శాతంతో రాష్ట్రంలో 7వ స్థానం, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 82 శాతంతో 9వ స్థానం సాధించారు.**

ఈసారి కూడా ఇంటర్‌ఫలితాల్లో బాలికలు తామే ఫస్ట్ అంటూ ముందంజలో ఉన్నారు. జూనియర్ ఇంటర్‌లో బాలురు 73 శాతం, బాలికలు 80శాతం, సీనియర్ ఇంటర్‌లో బాలురు 76శాతం, బాలికలు 83 శాతం మార్కులు సాధించారు. దీంతో ఈ పరీక్షల్లో బాలికలదే పైచేయి అయింది.

జూనియర్ ఇంటర్‌లో జిల్లాలో 25,147 మంది పరీక్షలకు హాజరు కాగా, 19,682 (78శాతం) మంది ఉత్తీర్ణులు కావడం విశేషం. దీంతో, గతంలో కంటే 5 శాతం ఉత్తీర్ణత పెరిగి, రాష్ట్రంలో నెల్లూరుజిల్లా 7వ స్థానం సాధించింది. అదేవిధంగా, సీనియర్ ఇంటర్‌లో కూడా 24,141 మంది పరీక్షలు రాస్తే, వారిలో 19,771 (82 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. ప్రభుత్వ కళాశాలల్లోనూ విద్యార్థులు 72 శాతం ఉత్తీర్ణత సాధించారు.

### సప్లిమెంటరీ, ఇంప్రూవ్‌మెంట్ పరీక్షలు..21 నుంచి :

విద్యార్థుల విద్యాసంవత్సరం వృధా కాకుండా అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు, ఇంప్రూవ్‌మెంట్ పరీక్షలకు కూడా ప్రభుత్వం అవకాశం కల్పిస్తూ, ఆ పరీక్షలకు తేదీలని ప్రకటించింది. మే 21 నుంచి జూన్ 4వతేదీ వరకు రోజుకు రెండు సెషన్స్‌లో పరీక్షలు నిర్వహిస్తారు. ఈనెల 20 నుంచి 27వ తేదీ వరకు రీ-వెరిఫికేషన్ ఉంటుంది. రీకౌంటింగ్‌కి దరఖాస్తు చేయాలనుకునేవారు కూడా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ, ఇంప్రూవ్‌మెంట్ పరీక్షలు రాయాలనుకున్నవారు పరీక్ష ఫీజు చెల్లించి పరీక్షలకు హాజరు కావచ్చని విద్యాశాఖ వర్గాలు తెలిపాయి. అదేవిధంగా, ప్రాక్టికల్ పరీక్షలు కూడా జూన్ 7 నుంచి 11వ తేదీ వరకు జిల్లా కేంద్రంలో జరుగుతాయి. గతంలో హాజరు కాలేని విద్యార్థులు కూడా ఇప్పుడు హాజరు కావచ్చని వారు వివరించారు.

# మత్స్యకారులకు అన్యాయం జరిగితే సహించం!

## • కూటమి ప్రభుత్వంపై జగన్ మండిపాటు



కూటమి ప్రభుత్వం మత్స్యకారులకు అన్యాయం చేస్తోందని, జువ్వలదిన్నె నుంచి మత్స్యకారులను తరిమేసేందుకు కుట్ర చేస్తోందని వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మండిపడ్డారు. మత్స్యకారులకు అన్యాయం జరిగితే సహించేది లేదన్నారు. కావలి నియోజకవర్గం బోగోలు మండలం లోని జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌ను ఆయన ఈనెల 15న సందర్శించి మత్స్యకారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన కూటమి ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. రెండేళ్ళ క్రితమే జాతికి అంకితమైన ఈ హార్బర్‌ని ప్రభుత్వం మత్స్యకారులకి అప్పగించకుండా సాగర్ డిఫెన్స్‌కి కట్టబెట్టడం దారుణమన్నారు. తమ హయంలో మత్స్యకారుల అభ్యున్నతికి ప్రణాళికలు సిద్ధం చేస్తే, కూటమి ప్రభుత్వం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే మత్స్యకారులకు న్యాయం జరుగుతుందని హామీ ఇచ్చారు. జువ్వలదిన్నె హార్బర్‌ను ప్రైవేట్ పరం కానివ్వమని, మత్స్యకారుల ప్రయోజనాల కోసం తమ పార్టీ పోరాడుతుందని భరోసా ఇచ్చారు. వైసీపీ నెల్లూరు నియోజకవర్గం ఇన్‌చార్జి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లాకి చెందిన పలువురు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

# నెల్లూరు నాయకులకు..సముచిత స్థానం

## • మొత్తం 16 మందికి పార్టీలో వివిధ పదవులు

తెలుగుదేశం పార్టీ తాజాగా ప్రకటించిన పార్టీ రాష్ట్ర కమిటీలో నెల్లూరుజిల్లాకి చెందిన పలువురు సీనియర్ నేతలకు, నియోజక వర్గాల్లో తమ సత్తా చాటుకుంటున్న కొంతమంది నాయకులకు స్థానం లభించింది. మొత్తం 16 మందికి రాష్ట్ర కమిటీలో వివిధ పదవులు దక్కడంతో జిల్లాకు మంచి ప్రాధాన్యత ఇచ్చినట్లయింది. దీంతో తెలుగు తమ్ముళ్ళలో ఉత్సాహం రెట్టింపైంది.

టీడీపీ రాష్ట్ర పార్టీలో పొలిట్‌బ్యూరో సభ్యురాలిగా కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి నియమితులు కాగా, గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్‌కి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పదవి దక్కింది. సీనియర్ నాయకుడు బొల్లినేని రామారావును పార్టీ జాతీయ ఉపాధ్యక్షునిగా నియమించారు. అదేవిధంగా, గతంలో వైకాపా అరాచకాలను ఎదిరించి పోరాడిన సీనియర్ నాయకుడు, మాజీమంత్రి..సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తాజాగా టీడీపీ జాతీయ అధికార ప్రతినిధిగా నియమితులయ్యారు. 2012 నుంచి ఇప్పటిదాకా పార్టీలో పొలిట్‌బ్యూరో సభ్యునిగా కూడా ఉన్న సోమిరెడ్డికి జిల్లా, రాష్ట్ర రాజకీయాలపై అపారమైన అనుభవం ఉన్న విషయం అందరికీ విదితమే!

ఆయనతో పాటు, నెల్లూరుకు చెందిన మరో నాయకుడు, అనేక అంశాలలో వైకాపా తీరును ధైర్యంగా ఎండగట్టిన ఆనం వెంకటరమణారెడ్డిని జాతీయ అధికార ప్రతినిధిగా ప్రకటించారు. ఆయన ప్రస్తుతం ఆక్వాకల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ కార్పొరేషన్ కో-ఛైర్మెన్‌గా కూడా ఉన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షునిగా..నెల్లూరులోని మరో టీడీపీ నేత..మైనార్టీల నాయకుడు.. రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఛైర్మెన్ అబ్దుల్ అజీజ్ ఎంపికయ్యారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గానికి సంబంధించి, కోటంరెడ్డి సోదరులు చేస్తున్న ప్రగతిపనులను దృష్టిలో పెట్టుకుని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సోదరుడు.. కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డికి రాష్ట్ర అధికార ప్రతినిధిగా పార్టీలో సముచిత స్థానం కల్పించారు. వారితో పాటు, కోవూరు నియోజకవర్గానికి చెందిన పెళ్ళకూరు శ్రీనివాసులురెడ్డిని జోనల్ కో-ఆర్డినేటర్‌గా, కావలికి చెందిన మలిశెట్టి వెంకటేశ్వర్లును రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా నియమించారు. అదేవిధంగా, నెల్లూరు నగర నియోజకవర్గానికి చెందిన ఏడుకొండలును, నెల్లూరు రూరల్‌కి చెందిన జెన్ని రమణయ్య, పనబాక భూలక్ష్మి, గూడూరుకు చెందిన బిల్లు చెంచురామయ్య, ఉదయగిరికి చెందిన గంజం రాఘవేంద్రలను కూడా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులుగా ఎంపికచేశారు. నెల్లూరు రూరల్‌కి చెందిన తడికపల్లి సుధ, గూడూరుకు చెందిన మట్టం శ్రావణిలు రాష్ట్ర కార్యదర్శులుగా నియమితులయ్యారు.

# అపోలోలో అరుదైన ఆపరేషన్!

## ఒక్కరోజు వయసున్న శిశువుకు విజయవంతంగా మెదడు శస్త్ర చికిత్స





ప్రాణాపాయ స్థితిలో ఉన్న.. ఒక్క రోజు వయస్సు గల శిశువుకు నెల్లూరులోని అపోలో స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు న్యూరో సర్జన్ డాక్టర్ వెంకట్ ఆధ్వర్యంలో మెదడు శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించి, శిశువుకు పునర్జన్మను ప్రసాదించారు. డాక్టర్ వెంకట్ ఆ శస్త్ర చికిత్స వివరాలను తెలియజేశారు. ఓ ఆసుపత్రిలో ప్రసవం జరిగిన సమయంలో శిశువుకు మెదడు కుడి భాగంలో భారీగా రక్తస్రావం జరిగింది. దీనివల్ల శిశువుకు ఫిట్స్, స్పృహ కోల్పోవడం వంటి తీవ్ర లక్షణాలు కనిపించాయి. వెంటనే ఆ శిశువును తల్లిదండ్రులు అపోలో స్పెషాలిటీ హాస్పిటల్‌కు తీసుకొచ్చారు. పరిశీలించిన వైద్యులు ఆ శిశువుకు తక్షణం మెదడుకు శస్త్ర చికిత్స చేయాలని నిర్ణయించారు. ఆ మేరకు న్యూరోసర్జన్ డాక్టర్ వెంకట్ తల్లిదండ్రులకు తెలియజేయగా వారి అంగీకారంతో ఆ శిశువుకు "డీకంప్రెసివ్ క్రానియెక్టమీ' మరియు మెదడులో పేరుకుపోయిన రక్తపు గడ్డలను తొలగించే శస్త్రచికిత్సను చేశారు. న్యూరో సర్జన్ డాక్టర్ వెంకట్ మరియు ఆయన బృందం ఆ ఆపరేషన్‌నేని విజయవంతంగా నిర్వహించడం విశేషం. ప్రస్తుతం శిశువు పూర్తిగా కోలుకోవడంతో డిశ్చార్జ్ చేశామని వైద్యులు తెలిపారు. ఈ చికిత్సలో ఆపోలో ఆసుపత్రి డైరెక్టర్ ఆఫ్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ శ్రీరామ్ సతీష్, యూనిట్ హెడ్ డాక్టర్ బిందు భార్గవిరెడ్డి, పీడియాట్రిషియన్లు రాజశేఖర్, మహమ్మద్ రఫీ, భరత్, అనస్థీషియా విభాగం హెడ్ రాజమోహన్‌రెడ్డి, వారి బృందం కీలకపాత్ర పోషించారని డాక్టర్ వెంకట్ వెల్లడించారు.

# ఇంటర్నేషనల్ స్కూల్‌ని..పటిష్ఠంగా నిర్మిస్తున్నాం


నెల్లూరులో ఇంటర్నేషనల్ స్కూల్‌ని పటిష్ఠంగా నిర్మిస్తున్నామని రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఛైర్మెన్ అబ్దుల్ అజీజ్ చెప్పారు. ఇటీవల ఆయన స్థానిక పరమేశ్వరినగర్‌లోని వక్ఫ్‌బోర్డు స్థలంలో నిర్మిస్తున్న ఇంటర్నేషనల్ స్కూల్ నిర్మాణ పనులను పరిశీలించారు. రిత్విక్ సంస్థ ప్రతినిధులతో నిర్మాణ విషయాలపై చర్చించారు. అనంతరం అబ్దుల్ అజీజ్ విలేకర్లతో మాట్లాడుతూ, డ్యాం కట్టడాలకు ఉపయోగించే జియో రీ ఎన్ఫోర్స్మెంట్ గ్రాన్యూల్ బెడ్ టెక్నాలజీతో ఈ స్కూల్ నిర్మాణం ప్రారంభించామని తెలిపారు. భవిష్యత్తులో ఎంత సీపేజ్ వచ్చినా ఇబ్బందిలేకుండా డిజైన్ చేసి, గుజరాత్ నుంచి మెటీరియల్ తెప్పించి నిర్మాణాన్ని ప్రారంభించామన్నారు.

J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 16
THE BEST TELUGU WEEKLY OF NELLOREANS




# లాయర్

సంపుటి : 45 సంచిక : 46 17.4.2026, శుక్రవారం వెల : రూ. 10/- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి



# నిరంతర పరిశోధనలకి..ఆయనో నిలువెత్తు నిదర్శనం!

## ● ప్రముఖ శాస్త్రవేత్త అనుమకొండ వరదరాజులకు అంతర్జాతీయంగా గుర్తింపు



వరదరాజులును సత్కరిస్తున్న జేసీ మొగిలి వెంకటేశ్వర్లు

నిరంతర పరిశోధనకి..ఆయనో నిలువెత్తు నిదర్శనం. ఆయన మరెవరో కాదు..నెల్లూరుకు చెందిన ప్రముఖ శాస్త్రవేత్త..విశ్రాంత ప్రొఫెసర్ డాక్టర్ అనుమకొండ వరదరాజులు. దాదాపు 75 ఏళ్ళ వయసులో కూడా నేటికీ అలుపెరగకుండా, నిర్విరామంగా పరిశోధనలు చేస్తుంటారాయన. అమెరికాలోని స్టాన్‌ఫోర్డ్ యూనివర్శిటీ ప్రకటించిన ప్రముఖ శాస్త్రవేత్తల జాబితాలో ఆయన ఒకరు కావడం విశేషం. పర్యావరణ అనుకూల నానో కాంపోజిట్, నానో మెడిసిన్ రంగాల్లో ఆయన చేసిన పరిశోధనలు ప్రపంచ వ్యాప్త గుర్తింపుని పొందాయి. తన పరిశోధనలకు అంతర్జాతీయ స్థాయిలో లభించిన గుర్తింపును నెల్లూరు ప్రజలకు అంకితం చేస్తూ, ఇటీవల ఆయన ఆ పత్రాలను జిల్లా జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లుకు అందజేశారు. డాక్టర్ వరదరాజులు ప్రపంచవ్యాప్తంగా అరుదైన గౌరవాన్ని అందుకోవడం సంతోషకరమంటూ జేసీ ఆయన్ను అభినందించి సన్మానించారు.

### యువతకు ఆదర్శం - జేసీ అభినందన

నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో నిర్వహించిన అభినందన సభలో జేసీ మాట్లాడుతూ, వరదరాజులు చేస్తున్న శాస్త్ర సాంకేతిక రంగ సేవలు యువ పరిశోధకులకు ఆదర్శమన్నారు. స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయం ప్రకటించే ప్రపంచంలోని ప్రఖ్యాత శాస్త్రవేత్తల జాబితాలో వరుసగా ఐదు సంవత్సరాలు (2021–2025) ఆయన స్థానం సంపాదించడం సంతోషకరమన్నారు. ఆయన కృషికి అనేక భారతీయ మరియు అంతర్జాతీయ పేటెంట్లు లభించడం రాష్ట్రానికే గౌరవమన్నారు. పసుపు, గోమూత్రం వంటి సహజ పదార్థాలతో అభివృద్ధి చేసిన యాంటీ–బాక్టీరియల్ నానో–కాంపోజిట్లు ఆసుపత్రి వినియోగానికి అనువుగా ఉండి, బ్యాక్టీరియా సంక్రమణలను తగ్గించడంలో సహాయపడుతున్నాయని తెలిపారు. ఈ పరిశోధనలకు భారత ప్రభుత్వం నుండి అనేక పేటెంట్లు, థాయ్‌లాండ్‌లో రెండు పేటెంట్లు లభించడం గొప్ప విషయమన్నారు. అంతర్జాతీయ జర్నల్స్‌లో 250కి పైగా పరిశోధనా పత్రాలను ప్రచురించి, బీజింగ్‌లోని చైనీస్ అకాడమీ ఆఫ్ సైన్సెస్‌లో అనేక సార్లు పరిశోధనల్లో పాల్గొనడం, థాయ్‌లాండ్‌లోని కింగ్ మాంగ్‌కుట్ విశ్వవిద్యాలయంలో బోధన అందించడం ఆయన ప్రతిభకు నిదర్శనమని తెలిపారు. ఇటీవల అభివృద్ధి చేసిన పసుపు ఆధారిత నానో–కాంపోజిట్ ప్రయోగశాల స్థాయిలో క్యాన్సర్ కణాలను తగ్గించే సామర్థ్యం చూపడం వైద్యరంగానికి ఆశాజనకమని పేర్కొన్నారు. ఈ ఆవిష్కరణకు భారత ప్రభుత్వ పేటెంట్ లభించగా, భవిష్యత్తులో క్లినికల్ ట్రయల్స్ నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు.

### నెల్లూరంటే ప్రత్యేక అభిమానం - వరదరాజులు

నానో శాస్త్రవేత్త డాక్టర్ వరదరాజులు మాట్లాడుతూ, తాను ఎక్కడున్నా తనకు జన్మనిచ్చిన నెల్లూరు అంటే తనకు ప్రత్యేక అభిమానమన్నారు. తాను నెల్లూరులో ప్రాథమికవిద్య పూర్తిచేసి, వి.ఆర్. కళాశాలలో ఉన్నత విద్యను అభ్యసించి, శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం నుండి పిహెచ్‌డీ పొందినట్లు చెప్పారు. ఆ తర్వాత అనంతపురంలోని శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో అధ్యాపకుడిగా, పరిశోధకుడిగా సేవలందించి 2010లో పదవీ విరమణ పొందినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఓ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# షాదీ మంజిల్ భవనాల అభివృద్ధికి చర్యలు


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల

జిల్లాలోని షాదీ మంజిల్ భవనాల అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. సోమవారం ఆయన తన చాంబర్‌లో షాదీ మంజిల్ నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని షాదీ మంజిళ్ల ప్రస్తుత పరిస్థితులు, అవసరమైన మౌలిక వసతులపై సమగ్రంగా చర్చించారు. షాదీ మంజిళ్లలో డైనింగ్ హాళ్ళు, మరుగుదొడ్లు వంటి మౌలిక వసతుల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని నిర్వాహకులు కలెక్టర్‌ను కోరారు. అలాగే, నూతన కమిటీల నియామకం అవసరమని సూచించారు. ఈ నేపథ్యంలో, నిర్వాహకులందరూ ఒక వారంలోగా సమావేశమై షాదీ మంజిళ్ల అభివృద్ధి, కమిటీల ఏర్పాటు, నిర్వహణ తదితర అంశాలపై చర్చించి తగు నివేదికతో హాజరుకావాలని కలెక్టర్ సూచించారు.

## 'పీఎం కుసుమ్' పథకంపై సమీక్ష..

కేంద్రప్రభుత్వం అమలుచేస్తున్న పీఎం కుసుమ్ పథకంపై ఈనెల 13న కలెక్టర్ కార్యాలయంలో సమీక్ష జరిగింది. జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల అధ్యక్షతన విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో జరిగిన ఈ సమీక్షలో ఆ పథకం పురోగతిపై చర్చించారు. జిల్లాలో ఈ పథకం అమలుకు మొత్తం 437 ఎకరాల భూమిని గుర్తించామని, అందులో 215 ఎకరాల భూమి ఇప్పటికే తీసుకోవడం పూర్తయిందని, మిగిలిన భూమిలో 22 ఎకరాలను త్వరలోనే స్వాధీనం చేసుకుంటామని అధికారులు తెలిపారు. ఆ భూములపై సోలార్ పవర్ ప్రాజెక్టులు ఏర్పాటు చేసి, జిల్లాలోని వ్యవసాయ వినియోగదారులకు పగటి సమయంలో నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడం ఈ పథకం ప్రధాన లక్ష్యమని కలెక్టర్ తెలిపారు. ఈ భూములపై ఉత్పత్తి అయ్యే సోలార్ విద్యుత్తును జిల్లాలోని అన్ని విద్యుత్ డివిజన్లకు పంపిణీ చేసి, వ్యవసాయ రంగానికి స్థిరమైన మరియు నిరంతర విద్యుత్ సరఫరా కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యుత్ శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్ కె.రాఘవేంద్రం తదితరులు పాల్గొన్నారు.

## వేదగిరికి విద్యుత్ వెలుగుల కోసం..

# 9 లక్షల వితరణ



నెల్లూరు రూరల్ మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం..నరసింహకొండ ఘాట్‌రోడ్డు విద్యుద్దీప కాంతులతో ప్రకాశమానం కావాలని కోరుకుంటూ పలగాని శ్రీహర్షరెడ్డి అనే దాత, అందుకు అవసరమైన 9 లక్షల రూపాయలను వితరణగా ఇచ్చారు. ఆ మేరకు డీడీని ఈనెల 14న ఆలయ పాలకమండలి ఛైర్మెన్ ఇందుపూరు అచ్యుత్‌శంకర్‌రెడ్డి, ఆలయ కార్యనిర్వహణాధికారి గోపికి అందజేశారు.

# పార్కిన్సన్ వ్యాధికి..'అపోలో'లో మెరుగైన వైద్యం

## ● డాక్టర్ బిందుమీనన్ వెల్లడి



వాక్‌థాన్‌లో పాల్గొన్న అపోలో వైద్యులు

పార్కిన్సన్ వ్యాధితో బాధపడుతున్న వారికి నెల్లూరులోని అపోలో ఆసుపత్రిలో మెరుగైన వైద్యం లభిస్తుందని ఆ ఆసుపత్రి న్యూరాలజీ విభాగం అధిపతి డాక్టర్ బిందుమీనన్ చెప్పారు. ప్రపంచ పార్కిన్సన్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇటీవల అపోలో ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో నగరంలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. తొలుత, అపోలో ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది, ప్రజలతో కలిసి స్థానిక చిల్డ్రన్స్‌పార్క్ నుండి అపోలో ఆసుపత్రి వరకూ వాక్‌థాన్ కార్యక్రమం అనంతరం జరిగిన సదస్సులో డాక్టర్ బిందుమీనన్ మాట్లాడుతూ, పార్కిన్సన్ వ్యాధి తొలి దశ లక్షణాలు, జీవన శైలి మార్పులు మరియు సకాలంలో చికిత్స తీసుకోవడంపై ప్రజలకు అవగాహన కలిగించారు. పార్కిన్సన్ అనేది మెదడులోని నరాల బలహీనతకు సంబంధించిన ఒక తీవ్రమైన వ్యాధి అని, శరీరంలో వణుకు, కదలికలు మందగించడం, కండరాల బిగుతు మరియు నడకలో స్థిరత్వం లేకపోవడం లాంటివి ఈ వ్యాధి లక్షణాలని వివరించారు. వ్యాధి తీవ్రమైన దశలో రోగుల కోసం 'డీప్ బ్రెయిన్ స్టిమ్యులేషన్'(డీబీఎస్) వంటి అత్యాధునిక చికిత్సలను నెల్లూరు అపోలో స్పెషాలిటీ హాస్పిటల్‌లో తాము అందుబాటులోకి తీసుకొచ్చినట్లు వెల్లడించారు. ఈ చికిత్స ద్వారా రోగుల శారీరక కదలికలలో గణనీయమైన మార్పు రావడమే కాకుండా, వారు వాడే మందుల మోతాదును తగ్గించి, రోగి జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తామని తెలియజేశారు. హాస్పిటల్ డైరెక్టర్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ శ్రీరామ్‌సతీష్, యూనిట్ హెడ్ డాక్టర్ బిందుభార్గవిరెడ్డి, డాక్టర్ రష్మీ, డాక్టర్ శివశంకర్, డాక్టర్ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# నేత్రపర్వంగా.. శ్రీ వేంకటేశ్వర, శివపార్వతుల కల్యాణోత్సవాలు!




నెల్లూరులోని శ్రీ వేంకటేశ్వర కల్యాణ మహోత్సవ సేవా సమితి ఆధ్వర్యంలో ఈనెల 12వ తేది ఉదయం శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వారి కల్యాణమహోత్సవం నేత్రపర్వంగా జరిగింది. ప్రముఖ వేదపండితులు వేదగిరి ఫణిశర్మ బృందంలోని గణేష్, తారకేష్‌స్వామిల నేతృత్వంలో టౌన్‌హాలులో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. తొలుత, శ్రీవారికి–అమ్మవార్లకు విశేషాలంకరణలు చేసి, వేదమంత్రాలు–మంగళవాద్యాల మధ్య శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా 'గోవింద' నామస్మరణలతో పురమందిరం మార్మోగింది. అనంతరం, 13వ తేది సాయంత్రం శివపార్వతుల పెళ్ళివేడుక కన్నులపండువగా జరిగింది. నిర్వాహకులు భక్తులందరికీ స్వామివార్ల తీర్థప్రసాదాలు అందజేశారు. శ్రీ వేంకటేశ్వర కల్యాణ మహోత్సవ సేవాసమితి గౌరవాధ్యక్షులు దువ్వూరు రాధాకృష్ణారెడ్డి, జిల్లా రెడ్‌క్రాస్ ఛైర్మెన్ వాకాటి విజయకుమార్‌రెడ్డి, సేవాసమితి అధ్యక్షులు 'కళాదీప్తి' సుబ్రహ్మణ్యం, సేవాసమితి సభ్యులు ఈ వేడుకలను పర్యవేక్షించారు. ఈ కల్యాణోత్సవాల్లో ప్రముఖ సంగీత గాయకుడు వివిఎస్ వినోద్‌కుమార్ ఆలపించిన ఆధ్యాత్మిక–సంకీర్తనా గానాలు, చిన్నారులు వేద అక్షయ, శ్రీజ ప్రదర్శించిన భక్తినృత్యాలు అందరినీ అలరించాయి.

# బిరియానీ హోటళ్ళలో..మురుగుడు మాంసం


బిరియానీ హోటళ్ళలో తనిఖీలు నిర్వహిస్తున్న ఆరోగ్యాధికారులు

రోజుల తరబడి మురిగిపోయిన మాంసాన్ని వినియోగదారులకు వండి వడ్డిస్తూ, ప్రజారోగ్యాన్ని గుల్ల చేస్తున్న హోటళ్ళపై అధికారులు దృష్టిసారించారు. ఇటీవల ఆకస్మిక తనిఖీలు చేసి, నెల్లూరు నగరంలోని పలు బిరియానీ హోటళ్ళలో నిల్వమాంసం (మురిగిపోయిన మాంసం) ఉండడాన్ని అధికారులు గుర్తించారు. కార్పొరేషన్ కమిషనర్ నందన్ ఆదేశాలతో నగరపాలక సంస్థ ఆరోగ్యాధికారి తమ సిబ్బందితో కలిసి నగరంలోని పలు ప్రాంతాల్లో ఉన్న బిరియానీ హోటళ్ళపై ఆకస్మిక తనిఖీలు చేశారు. మినీబైపాస్, రాంజీనగర్ ప్రాంతంలోని రెండు హోటళ్ళలో నిల్వ ఉంచిన చికెన్, మటన్‌లను వెలికి తీయించి, పాడైపోయి గబ్బు కొడుతున్న ఆ మాంసాన్నంతా ఫినాయిల్ పోసి నిర్వీర్యం చేశారు. నిబంధనలు పాటించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఆ హోటళ్ళ యజమానులకు నోటీసులు కూడా జారీ చేశారు.

J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 16




THE BEST TELUGU WEEKLY OF NELLOREANS


# లాయర్

సంపుటి : 45 సంచిక : 46 17.4.2026, శుక్రవారం వెల : రూ. 10/- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

5 రాష్ట్రాల ఎన్నికలలో...

## మొగ్గు మోడీ వైపే!

### తమిళనాడు, పుదుచ్చేరి, అస్సోంలలో ఎన్డీయే ముందంజ




దేశ రాజకీయ పోటీల్లో సెమీఫైనల్స్‌గా భావిస్తున్న ఐదు రాష్ట్రాల ఎన్నికలు నాయకుల ఎత్తులు పైఎత్తులతో హోరాహోరీగా సాగుతున్నాయి. జాతీయ పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్ సహా ప్రాంతీయ శక్తులైన డీఎంకే, అన్నాడీఎంకే, ఎల్డీఎఫ్, యూడీఎఫ్, టీఎంసీ, ఎన్‌ఆర్ కాంగ్రెస్, టీవీకే విజయం కోసం సర్వశక్తులు ఒడ్డుతున్నాయి. అయితే ఎవరెన్ని వ్యూహాలు పన్నినా మరోసారి మోడీ మ్యాజిక్ ఖాయమనే వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి. దీనికి ప్రధాన కారణం ఐదు రాష్ట్రాల్లో మూడుచోట్ల స్పష్టంగా ఎన్డీయేకు మొగ్గు కనిపిస్తుండడమే. ముఖ్యంగా మన సరిహద్దు రాష్ట్రమైన తమిళనాడులో తొలిసారి కమలం వికసించనుందనే అంచనాలు బీజేపీ వర్గాల్లో కొత్త ఉత్సాహం నింపుతున్నాయి. అదే నిజమైతే దక్షిణాదిన పాగా వేయాలన్న కమలనాథుల లక్ష్యం నెరవేరినట్లే.

13లో

నవ్యాంధ్ర నిర్మాతగా...

## క్యాపిటల్ కెప్టెన్‌గా బాబు

### ఏప్రిల్ 20న చంద్రబాబు జన్మదినం



నవ్యాంధ్ర ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచే నాయకుల్లో చంద్రబాబు తొలిస్థానంలో ఉంటారనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. ఎందుకంటే 30 ఏళ్లకు పైగా పార్టీ అధ్యక్షుడిగా దాదాపు 20 ఏళ్లకు పైగా ప్రతిపక్ష నాయకుడిగా 15 ఏళ్లకు పైగా ముఖ్యమంత్రిగా తెలుగు ప్రజలకు సేవచేసిన ఇంకొక నేత లేదు. ఇంతటి ఘన కీర్తి కలిగిన సీఎం చంద్రబాబు ప్రస్తుతం అమరావతి సాధనే ధ్యేయంగా ముందుకు సాగుతున్నారు. ఆంధ్రుల కలల రాజధానికి ఓ రూపమిచ్చి చరిత్ర పుటల్లో నిలిచిపోవాలని ఆయన ఆకాంక్షిస్తున్నారు. క్యాపిటల్ కెప్టెన్‌గా అహరహం అమరావతికోసం తపిస్తున్నారు. అదే సమయంలో గత పాలకుల వైఫల్యం కారణంగా గాడి తప్పిన రాష్ట్రాన్ని మళ్లీ అభివృద్ధి పథంలో నడిపించేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తున్నారు.

13లో




మారంరెడ్డి గోపాల్‌రెడ్డి గారు

జననం: 12.04.1950 నిర్యాణం: 21.04.2023

## స్మృత్యంజలి

మానవీయ విలువలున్న మహామనీషి
చిరునవ్వుతో పలకరించే స్నేహాభిలాషి
నిష్కల్మష సేవాభిలాషి, మా కుటుంబ శ్రేయోభిలాషి

**మారంరెడ్డి గోపాల్‌రెడ్డి గారు**

దివంగతులై తేదీ. 21.04.26 నాటికి
మూడేళ్ళు గడవనున్న సందర్భంగా
ఆ పుణ్యమూర్తిని సంస్మరించుకుంటూ...

భార్య : **మారంరెడ్డి ప్రసూన**

అల్లుళ్ళు - కుమార్తెలు

**ఆనం మహేష్‌కుమార్‌రెడ్డి - రాజి**

**ఆల్తూరు మహేష్‌కుమార్‌రెడ్డి - రాధిక**

మనుమరాళ్ళు, మనుమలు

**సంజితారెడ్డి, నితీష్‌రెడ్డి - కీర్తి**

**అనీష్‌రెడ్డి, శశాంక్‌రెడ్డి**

మరియు **కుటుంబసభ్యులు**

లాయర్
ఏప్రిల్ 17, 2026

# ఎండాకాలం.. గొంతులు ఎండే కాలం కాకూడదు!

ఎండాకాలం వస్తే చాలు.. మనదేశంలో గొంతులు ఎండే కాలం వచ్చినట్లే అవుతోంది..ఇటీవలి కాలంలో. ఏటా వేసవి వస్తున్నా, ఎన్నో ప్రాంతాల్లో ప్రజలు గుక్కెడు మంచినీటి కోసం నానా అవస్తలు పడుతూనే ఉండడం మామూలైపోయింది. ప్రభుత్వాలు మంచినీటి కష్టాలను చాలా తేలికగా తీసుకోవడం లేదా సరిగా పట్టించుకోకపోవడం వల్ల నానాటికీ ఇది జటిల సమస్యగానే మారుతోంది. ఒకవైపు విపరీతంగా పెరుగుతున్న జనాభా, మరోవైపు భూగర్భజలాల నీటిమట్టాలు అడుగంటిపోతుండడం, నీటి వనరులను కాపాడుకోలేకపోవడం, వాటిని సరిగా నిర్వహించుకోలేకపోవడం, గతంలో కంటే ఎండలు ఇప్పుడు మిడిమేళంగా కాస్తుండడం తదితర కారణాలతో నిత్యావసరమైన పరిశుభ్రజలాల కోసం ప్రజలు నానా యాతనలు పడాల్సివస్తోంది. మరోవైపు, అనేక ప్రాంతాల్లో కాలుష్యం పెరిగిపోయి, కలుషిత నీటిని తాగి అనేకరకాల జబ్బులతో ఆసుపత్రుల పాలయ్యేవారూ, చివరికి ఆ రోగాలతోనే మరణించేవారు గణనీయంగానే ఉన్నారు. మనదేశంలో ఇలాంటి దురదృష్టకర మరణాలు ఏటా రెండు లక్షలకు పైగానే ఉంటున్నాయని గణాంకాలు వెల్లడిస్తున్నాయి. పెరిగిపోతున్న పట్టణీకరణ, పారిశ్రామికీకరణల ఫలితంగా కూడా మంచినీటి కొరత ఏర్పడుతోందని నిపుణులు చెప్తున్నారు. దాహమైనప్పుడే బావి తవ్వుకునే చందంగా అప్పటికప్పుడు చేసే ప్రయత్నాల కన్నా, ముందస్తు చర్యల వల్ల ఎంతో ప్రయోజనం ఉన్నప్పటికీ నాయకుల్లో కానీ, ప్రభుత్వాల్లో కానీ చలనం ఉండడం లేదు. ఇప్పుడున్న నీటివనరులు పెరుగుతున్న జనాభా అవసరాలకి తగ్గట్టు లేకపోయినా, ఆయా ప్రాంతాల్లో నీటిసరఫరాకి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు అంతగా లేకపోవడం ఒక పెద్ద లోపం. వాతావరణ మార్పులతో ఎండాకాలంలో ఎండలు ముదిరిపోయి, చెరువులు దొరువులు, నదులు కాలువలు అన్నీ ఎండిపోతుంటాయి. భూగర్భజలాలు అడుగంటిపోతుంటాయి. అనేక గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు నిద్రలేచింది మొదలు ఏ వ్యవసాయ బోరు వద్దకో, బావికాడకో ఎంతెంతో దూరం వెళ్ళి కడవలు, బిందెలతో నీళ్లు మోసుకుని తెచ్చుకోవడం అందరికీ తెలిసిందే. పట్టణాల్లోనైతే మునిసిపల్ నీళ్లు ఎన్ని గంటలకి ఎంతసేపు వస్తాయో తెలియక కుళాయిల వద్ద గృహిణులు గంటల తరబడి నిరీక్షిస్తుండడం, ప్రైవేటు వ్యక్తులు అమ్మే నీళ్ల కోసం పడిగాపులు పడడం మనదేశంలో సర్వసాధారణ దృశ్యాలు. మహానగరాల్లో కూడా ఈ బాధలు తప్పడం లేదు. మద్రాసు, బెంగుళూరు, పంజాబ్, మహారాష్ట్ర, హర్యానా వంటి అనేక రాష్ట్రాలు, ఇంకా అనేక పట్టణాలు కూడా ఎండాకాలంలో మంచినీటి కోసం పడే వెతలు అన్నిన్ని కావు. ఎంతో లోతుగా ఉండే మెట్ల బావుల్లో అడుగంటిన నీళ్ళతోనే సరిపెట్టుకునే ప్రాంతాలూ దేశంలో ఎన్నో ఉన్నాయి. ఆంధ్ర, తెలంగాణాల్లోనూ గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో, శివారు ప్రాంతాలలో ప్రజలు పరిశుభ్రమైన మంచినీళ్ళు దొరక్క, బాటిలు నీళ్ళని కొనుక్కుని తాగడం అలవాటు చేసుకున్నారు. అనేక బడులు, హాస్టళ్ళలో పరిశుద్ధమైన నీరు లభించక విద్యార్థులు ఇక్కట్లు పడుతూనే ఉన్నారు. మూగజీవాలు సైతం గొంతు తడుపుకునేందుకు నీటి గుంటలని వెతుక్కుంటూ ఉంటాయి.

ఇకనైనా ప్రభుత్వాలు ఈ సమస్యల శాశ్వత పరిష్కారానికి ఏంచేయాలో ఆలోచించాలి. అనేక రాష్ట్రాల్లో నేటికీ అసంపూర్తిగా ఉన్న నీటి ప్రాజెక్టులను పూర్తిచేయించేందుకు సమాయత్తం కావాలి. చిన్నారులు చదువుకునే పాఠశాలలు, గురుకులాలు, విద్యాలయాల్లో తాగేందుకు మంచినీటికి లోటు లేకుండా అన్ని చర్యలూ తీసుకోవాలి. భూగర్భ జలాల పరిరక్షణకి, నీటివనరుల కల్పనకి దేశవ్యాప్తంగా ఎక్కడికక్కడ శ్రద్ధ తీసుకుంటే తప్ప ఈ దుస్థితి మారదు. వర్షాకాలంలో వచ్చే వాననీరు వృధాగా పోకుండా ప్రతి నీటిచుక్కని ఒడిసి పట్టుకోవాలి. ప్రభుత్వంతో పాటు ప్రజలు, స్వచ్ఛంధసంస్థలు కూడా ఇందులో భాగస్వాములు కావాలి. నీటి సమస్యలున్న ప్రాంతాల్లో మంచినీటి ట్యాంకర్లను అందుబాటులో ఉంచాలి. తాగేనీళ్ళు ఎక్కడా కలుషితం కాకుండా, ప్రజలకి పరిశుభ్రమైన నీరందేలా చూడాలి. దాహార్తితో మూగజీవాలు అలమటించకుండా పశుగణం ఉన్న ప్రతిచోటా నీటితొట్లను విరివిగా నెలకొల్పాలి. భూగర్భజలాలు కొంతమేరకైనా నిలవాలంటే, చెక్‌డ్యామ్‌లు, నీటిగుంతల వంటివి అవసరమని నిపుణులు ఎంతోకాలంగా చెప్తూనే ఉన్నారు. ఇకనైనా చిత్తశుద్ధితో ప్రభుత్వాలు, వెంటనే అలాంటి కార్యక్రమాలను కూడా ముమ్మరం చేయాల్సివుంది. ఎండాకాలంలో దాహార్తితో ఎవరూ బాధపడకుండా, ఎండాకాలమంటే.. మండే కాలంగా.. గొంతులు ఎండేకాలంగా మారకుండా ప్రభుత్వాలు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాల్సివుంది.

ఈ-మెయిల్ ప్రజావాణి
lawyerpatrika@gmail.com
+91 98663 14741

## మహిళాభ్యున్నతి ఒక్క బీజేపీతోనే సాధ్యం!

భారతదేశంలో మహిళల గౌరవం, సాధికారత గురించి అన్ని పార్టీలూ గత కొన్ని దశాబ్దాలుగా మాట్లాడుతున్నాయి. కానీ, ఒక్క నరేంద్రమోడీ నాయకత్వంలోని భారతీయ జనతా పార్టీ మాత్రమే ఆ మాటలకి వాస్తవ రూపం కల్పించి, ఆచరణ సాధ్యం చేయగలుగుతుందన్నది నా అభిప్రాయం. రాజకీయాల్లో మహిళలకు నిజమైన అవకాశాలు కల్పించడం, వారి నాయకత్వాన్ని ప్రోత్సహించడం, వారి భద్రత, గౌరవం కాపాడటంలో అన్నివిధాలా అవసరమైన నిర్ణయాలని కమలదళం తీసుకుని ఇప్పటికే దేశవ్యాప్తంగా అమలు చేస్తోందనడంలో సందేహం అవసరం లేదు. తాజాగా రాజకీయాలలో మహిళలకి 33 శాతం రిజర్వేషన్ల కోసం ఏకంగా పార్లమెంటులోనే చట్టం చేసే చారిత్రాత్మక ఘట్టానికి మోడీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. మహిళలను కేవలం ఓటు బ్యాంకుగా చూడకుండా, వారిని దేశ నిర్మాణంలో భాగస్వాములుగా చేసే దృక్పథం కలిగిన ఏకైక పార్టీగా బీజేపీ మరో అడుగు ముందుకేసింది. మహిళా సాధికారతపై పదేపదే ప్రగల్భాలు పలికే కాంగ్రెస్‌పార్టీలో వాస్తవంగా మహిళలకు న్యాయం జరుగుతోందా అన్నది పెద్ద ప్రశ్నే. ఏళ్లతరబడి సేవచేసిన మహిళా నేతలకు సరైన గుర్తింపు లేకపోవడం, అంతర్గత సమస్యలు, అవకాశాల కొరత వంటివి ఇప్పుడిప్పుడే ఆ పార్టీలో బహిర్గతమై రచ్చకి తెరలేపుతున్నాయి. ఇలాంటి తరుణంలో వొట్టి మాటలతో కాకుండా గట్టి చేతలతో మహిళలకు నిజమైన గౌరవాన్ని కల్పించగలిగిన రాజకీయ పార్టీ ఒక్క బీజేపీయే అన్నది ఎవరూ కాదనలేని నిజం. హ్యాట్సాఫ్ టు నమోజీ..!

యం. చంద్రమౌళి, కొత్త ఢిల్లీ.

## అభినందనీయులు మన నెల్లూరీయులు!

తన అపార ప్రతిభా నైపుణ్యంతో వైద్య ఆరోగ్య రంగంలో సంచలనాలకి సారధిగా నిలచిన ఘనులు 'పద్మభూషణ్' బిరుదాంకితులు, మన నెల్లూరీయులు డాక్టర్ వరప్రసాద్‌రెడ్డి గారు. కేవలం శాస్త్ర జ్ఞానంలోనే కాకుండా సంగీత, సాంస్కృతిక, సాహిత్య పరిజ్ఞానంలో కూడా వారు దిట్ట. అలాంటి వరప్రసాద్‌రెడ్డి గారు ఆయన చదువుకున్న జవహర్‌లాల్ టెక్నలాజికల్ యూనివర్సిటీ, కాకినాడ నుండే డాక్టరేట్ అందుకోవడం గొప్ప విషయం. అది ఆయనకి లభించిన సముచిత పురస్కారం. అలాగే వ్యాపార, సినిమా, ఆధ్యాత్మిక రంగాలలో తమ ఉనికిని చాటుకుంటున్న మరో నెల్లూరు ప్రముఖులు డాక్టర్ ఆల్తూరు మహేష్‌రెడ్డి గారు. వారు కూడా 125 సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర కలిగిన "తిలక్ మహారాష్ట్ర విద్యాపీఠ్" నుండి గౌరవ డాక్టరేట్ పొందడం అభినందనీయం. తాము సారథ్యం వహిస్తున్న వివిధ రంగాలలో తమ ప్రతిభని కనపరుస్తూ మన నెల్లూరు కీర్తిని ఇనుమడింపచేస్తున్న ఆ నెల్లూరీయులిద్దరికీ శుభాకాంక్షలు, సునమస్సులు!

లక్ష్మీభరద్వాజ్, హైదరాబాదు.

## మీడియా సంయమనం పాటించాలి!

ఇటీవల వైసీపీ నేతల గురించి, వారి కుటుంబసభ్యుల గురించి వీకెండ్ కామెంట్‌లో ఆంధ్రజ్యోతి రాధాకృష్ణ చేసిన వ్యాఖ్యలు పూర్తిగా అభ్యంతరకరం. రాజకీయ నేతలు హద్దు దాటి బూతులు మాట్లాడుతున్నారన్న నెపంతో గౌరవ ప్రదమైన మీడియా కూడా సంయమనం కోల్పోవడం విచారకరం. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకూడదని ఆశిద్దాం!

షేక్ ఖాదర్‌భాష, ఉదయగిరి.

# మనకూ సొంత ఏఐ

మనసులో మాట 93

ఇటీవల ఢిల్లీలో జరిగిన ఆర్మీ కమాండర్ల సమావేశంలో భారత క్యాబినెట్ కార్యదర్శి టి.వి. సోమనాథన్ ఒక కీలకమైన విషయాన్ని లేవనెత్తారు. భారతదేశ భద్రత కోసం మనం దేశీయంగా అభివృద్ధి చేసుకున్న కృత్రిమ మేధ (Sovereign AI) అవసరమని స్పష్టం చేశారు. అది విలాసం కాదు, ఒక అనివార్య అవసరమని ఆయన స్పష్టం చేశారు. చాలా ముఖ్యమైన సూచన ఇది.

మనం ఇప్పుడు ఒక ముఖ్యమైన సంధి కాలంలో ఉన్నాం. మానవ వనరులను, మానవ మేధను క్రమంగా కృత్రిమ మేధ ఆక్రమించుకుంటున్న దశలో ఉన్నాం. కృత్రిమ మేధ అన్ని పరిస్థితులను తన నియంత్రణలోకి తెచ్చుకుంటుంది అని ఆందోళన వ్యక్తం అవుతున్నప్పటికీ ఈ పరిజ్ఞానం రోజు రోజుకి కొత్త పుంతలు తొక్కుతూనే ఉంది. రక్షణ రంగంలోకి కూడా కృత్రిమ మేధ చొచ్చుకుని వచ్చింది. యుద్ధాలలో సైన్యం కూడా ఈ పరిజ్ఞానం మీద ఆధారపడక తప్పడంలేదు. దేశాల మధ్య ఘర్షణలు, యుద్ధాలలో డేటాది ఇప్పుడు ప్రముఖపాత్ర. ఈ నేపథ్యంలో వేరే దేశంలో అభివృద్ధి చేసిన కృత్రిమ మేధను ఉపయోగించుకుంటే అది మన రక్షణకు ప్రమాదకరంగా మారొచ్చని వివిధ దేశాలు భావిస్తున్నాయి. అందుకే ప్రపంచవ్యాప్తంగా ప్రతి దేశం తమకంటూ ఒక సొంత కృత్రిమ మేధ (AI) ఉండాలని కోరుకుంటోంది. దీనినే Sovereign AI అంటున్నారు.

చాలా దేశాలు ఇప్పుడు అమెరికాకు చెందిన చాట్–జిపిటి (Open AI) లేదా గూగుల్ వంటి సంస్థలపై కృత్రిమ మేధ కోసం ఆధారపడుతున్నాయి. వాటిని వాడుతున్నప్పుడు మన దేశ రహస్యాలు లేదా ప్రజల వ్యక్తిగత వివరాలు విదేశీ సర్వర్లలోకి వెళ్లే అవకాశం ఉంది. యుద్ధం లేదా అంతర్జాతీయ సంక్షోభం తలెత్తినప్పుడు ఆ దేశాలు మనకు సేవలు నిలిపివేస్తే మనం ఇబ్బందుల్లో పడతాం.

అందుకే సొంత ఏఐ మోడళ్లను అభివృద్ధి చేసుకోవడం అవసరం. దేశం సొంత ప్రజల డేటాను వాడుతూ, తన సొంత భాషల్లో, తన సంస్కృతికి అనుగుణంగా తయారు చేసుకునే AIని 'సావరిన్ ఏఐ' అంటారు. ఉదాహరణకు, మన దేశానికి సంబంధించిన ముఖ్యమైన సమాచారం లేదా నిర్ణయాలు వేరే దేశపు ఏఐ సాఫ్ట్‌వేర్ మీద ఆధారపడి ఉంటే, అది భవిష్యత్తులో మన భద్రతకు ముప్పు కలిగించవచ్చు. అందుకే భారత్ వంటి దేశాలు తమ సొంత 'భారత్ ఏఐ' మోడల్స్ కోసం ప్రయత్నిస్తున్నాయి. ఇప్పటివరకు మనం చూసిన ఏఐ మనం అడిగిన ప్రశ్నలకు సమాధానాలు మాత్రమే ఇచ్చేది. కానీ 'ఏజెంటిక్ AI' అంటే, అది ఒక మనిషి లాగా పనులు కూడా చేస్తుంది. ఉదాహరణకు, మీ తరపున ఒక ఇమెయిల్ పంపడం, టిక్కెట్లు బుక్ చేయడం లేదా ఒక కంపెనీలో నిర్ణయాలు తీసుకోవడం వంటివి. ఇలాంటి శక్తివంతమైన టెక్నాలజీ వేరొక దేశం చేతుల్లో ఉంటే, వారు మన వ్యవస్థలను నియంత్రించగలరనే భయం అన్ని దేశాల్లో మొదలైంది. రక్షణ రంగంలో ఏజెంటిక్ AI' చేయగల పనులను పరిశీలిస్తే... యుద్ధ రంగంలో శత్రువుల కదలికలను మనుషుల కంటే వేగంగా పసిగట్టగలదు. యుద్ధ విమానాలను లేదా డ్రోన్లను స్వయంగా నడపగలదు. క్లిష్ట పరిస్థితుల్లో క్షణాల్లో సరైన నిర్ణయం తీసుకుంటుంది. ఇలాంటి శక్తివంతమైన టెక్నాలజీ వేరే దేశంపై ఆధారపడి ఉంటే, అది మన రక్షణ వ్యవస్థకు పెనుముప్పు. అందుకే సైన్యం కోసం వాడే AI పూర్తిగా 'భారతీయమైనది' అయి ఉండాలని ప్రభుత్వం భావిస్తోంది.

ఈ నేపథ్యంలో దేశాల మధ్య ఇప్పుడు 'డిజిటల్ గోడలు' నిర్మించబడుతున్నాయి. దీనినే "డిజిటల్ ఐరన్ కర్టెన్" అంటున్నారు. "మా దేశ డేటా బయటకు వెళ్లకూడదు" అని దేశాలు డేటా ఆంక్షలు విధిస్తున్నాయి. అమెరికా వంటి దేశాలు తమ వద్ద ఉన్న శక్తివంతమైన కంప్యూటర్ చిప్స్‌ను ఇతర దేశాలకు ఇవ్వడం లేదు. అమెరికా ఒక రకమైన నియమాలు పాటిస్తుంటే, చైనా లేదా రష్యా తమ రాజకీయాలకు అనుగుణంగా ఏఐని తయారు చేసుకుంటున్నాయి.

దీనివల్ల ప్రపంచం రెండు గ్రూపులుగా విడిపోయే అవకాశం ఉంది. ఒకవైపు అమెరికా మరియు దాని మిత్రదేశాల ఏఐ వ్యవస్థలు, మరోవైపు ఇతర దేశాల వ్యవస్థలుగా విడిపోయే అవకాశం ఉంది.

అమెరికాకు చెందిన 'ఆంథ్రోపిక్' అనే సంస్థ 'క్లాడ్' (Claude) అనే ఏఐని తయారు చేసింది. ఇది చాలా సురక్షితమైనదని వారు చెబుతుంటారు. కానీ ఇది అమెరికా నియమాల ప్రకారమే పనిచేస్తుంది. ఒకవేళ భారత్ లేదా ఇతర దేశాలు ఈ టెక్నాలజీని వాడాలనుకుంటే, వారు అమెరికా నియమ నిబంధనలకు లోబడే పనిచేయాల్సి వస్తుంది. అందుకే ఇప్పుడు పలు దేశాలు సొంత ఏఐ టెక్నాలజీని అభివృద్ధి చేసుకునే పనిలో ఉన్నాయి. ఏఐ అనేది మానవాళి అభివృద్ధి కోసం ఉండాలి. కానీ దేశాల మధ్య ఉన్న పోటీ వల్ల అది ఒక ఆయుధంగా మారుతోంది. దేశాలు తమ భద్రతను చూసుకోవడం ముఖ్యం, కానీ అదే సమయంలో ప్రపంచమంతా కలిపి ఒకే రకమైన 'ప్రమాణాలు' పాటించకపోతే, భవిష్యత్తులో ఇంటర్నెట్ ముక్కలు ముక్కలుగా మారిపోతుంది. ఏ దేశానికి ఆ దేశం తమ రక్షణ దృష్ట్యా సొంత కృత్రిమమేధ పరిజ్ఞానం అభివృద్ధి చేసుకోవడం అనివార్యం. సోమనాథన్ గారు అన్నట్టు, ఇది భారతదేశానికి "స్ట్రాటజిక్ అటానమీ"(వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి)ని ఇస్తుంది. మనదైన సొంత కృత్రిమ మేధ కేవలం సైన్యానికే కాదు, మనదేశంలోని సామాన్య ప్రజలకు కూడా ఎంతో మేలు చేస్తుంది. తెలుగు లేదా ఇతర భారతీయ భాషల్లో AI సేవలు మరింత స్పష్టంగా అందుతాయి. మన బ్యాంకింగ్ మరియు ఆరోగ్య వివరాలు పరాయి దేశాల చేతుల్లోకి వెళ్లకుండా ఉంటాయి. మన దేశంలోనే కొత్త టెక్నాలజీ ఉద్యోగాలు వస్తాయి.



- తుమ్మల బాల గంగాధర్ తిలక్

## వైసీపీ హయాంలో..
# అంతా విధ్వంస పాలనే!

**● ధ్వజమెత్తిన మంత్రి ఆనం**



వైసీపీ హయాంలో రాష్ట్రంలో జరిగిన అయిదేళ్ళ పరిపాలన పూర్తిగా విధ్వంసకరంగా మారిందని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి దుయ్యబట్టారు. ఇటీవల ఆత్మకూరులో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ, రాష్ట్ర విభజన తర్వాత అమరావతిని రాజధానిగా అభివృద్ధి చేయాలని నిర్ణయించగా, రైతులు భూములు ఇచ్చి సహకరించారని, కేంద్ర ప్రభుత్వం కూడా ఆర్థిక సహాయం అందించిందని గుర్తుచేశారు. అయితే తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఆ అభివృద్ధిని పూర్తిగా నిలిపివేసిందని విమర్శించారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహాన్ని అమరావతిలో కాక, విజయవాడ ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఉంచడం దురదృష్టకరమని పేర్కొన్నారు. మూడు రాజధానుల పేరుతో గందరగోళం సృష్టించి రాష్ట్ర అభివృద్ధిని దెబ్బతీశారని, విశాఖపట్నం, కర్నూలు, విజయవాడ అంటూ స్పష్టత లేకుండా నిర్ణయాలు తీసుకున్నారని ఆరోపించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమరావతి అభివృద్ధి పనులు మళ్లీ ప్రారంభమయ్యాయని తెలిపారు. నివాస గృహాలు, రహదారులు, ఎక్స్‌ప్రెస్‌వేలు వంటి మౌలిక వసతుల నిర్మాణం వేగంగా కొనసాగుతోందన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో పోలవరం, అన్నమయ్య వంటి కీలక ప్రాజెక్టులు దెబ్బతిన్నాయని, చిన్నపాటి నిర్వహణ లేకపోవడంతో భారీ నష్టం వాటిల్లిందని అన్నారు. ప్రస్తుతం ఆ ప్రాజెక్టులను పునరుద్ధరించే పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. జగన్ హయాంలో నెల్లూరు జిల్లాలో కూడా అభివృద్ధి నిలిచిపోయిందని, కృష్ణపట్నం పోర్ట్ కార్యకలాపాలు తగ్గిపోయాయని, ఇప్పుడు కూటమి ప్రభుత్వం వాటిని మళ్లీ పునరుద్ధరించి వ్యాపారాన్ని వృద్ధి చేయడం జరుగుతోందని చెప్పారు. దగదర్తి విమానాశ్రయం పనులు కూడా తిరిగి ప్రారంభమవుతున్నాయని తెలిపారు. జువ్వలదిన్న ఫిషింగ్ హార్బర్ వంటి ప్రాజెక్టులను పూర్తి చేసి మత్స్యకారులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజా సమస్యలను ప్రస్తావించాల్సిన ప్రతిపక్షం అసెంబ్లీకి హాజరుకాక పోవడం బాధాకరమని విమర్శించారు. ప్రతిపక్షం వాళ్ళు కూటమి ప్రభుత్వంపై అనవసర విమర్శలు చేయకుండా ప్రజల ప్రయోజనాల కోసం సహకరించాలని ఆయన హితవు పలికారు.

# ప్రశాంతిరెడ్డికి..రాష్ట్ర కమిటీలో చోటు!

**● టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యురాలిగా నియామకం**



***కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కమిటీలో చోటు దక్కింది. పార్టీ అధిష్టానం ఈనెల 15న అమరావతిలో జరిగిన సమావేశంలో ప్రశాంతిరెడ్డిని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యురాలిగా నియమించడంతో కోవూరుతో పాటు, జిల్లా పార్టీ వర్గాల్లోనూ సంతోషం వ్యక్తమవుతోంది. మొత్తం 29మందితో పొలిట్‌బ్యూరో ఏర్పాటు చేయగా,వారిలో నెల్లూరుజిల్లా కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డికి చోటు లభించడం విశేషం!***


టీడీపీ రాష్ట్ర అధ్యక్షునిగా పల్లా శ్రీనివాస్‌ని కొనసాగిస్తూ, తెలుగుదేశం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నారా లోకేశ్‌ని నియమించడంతో పార్టీలో యువ శకం ఆరంభమైందంటూ పార్టీ వర్గాలు సంతోషం వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో, జిల్లాలోనూ నాయకులకు పార్టీలో సముచిత స్థానం లభించడం విశేషం. తాజాగా అధిష్టానం ముగ్గురిని జాతీయ ప్రధాన కార్యదర్శులుగా, 18 మందిని జాతీయ ఉపాధ్యక్షులుగా, మరో 10మందిని అధికార ప్రతినిధులుగా, 26మందిని పొలిట్‌బ్యూరో సభ్యులుగా, 32 మందితో జాతీయ కమిటీని, 180 మందితో రాష్ట్ర కమిటీని ఏర్పాటుచేసింది. సీనియర్ నేతలు-జూనియర్ నాయకుల మధ్య సమతూకం పాటిస్తూ, అన్ని వర్గాలకు ప్రాధాన్యత కల్పిస్తూ రాష్ట్ర కమిటీని రూపొందించారు. ఈ నేపథ్యంలో కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని పొలిట్‌బ్యూరో సభ్యురాలిగా నియమించడంతో కోవూరులోనే కాక, జిల్లా పార్టీ వర్గాల్లో హర్షాతిరేకాలు వెల్లడవుతున్నాయి. ప్రముఖ దాత, సేవా భూషణులు.. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సతీమణి అయిన ప్రశాంతిరెడ్డి దంపతులు ప్రజా ప్రతినిధులుగా ప్రజలకు సేవలందించడమే కాక, ఆధ్యాత్మిక, సామాజిక రంగాల్లోనూ తమ ప్రాధాన్యతను చాటుకుంటూ, ప్రజల మనసుల్లో సుస్థిరస్థానం సాధించుకున్న విషయం తెలిసిందే.

## పార్టీలో.. సముచిత స్థానం

**● ఎంపీ వేమిరెడ్డి సంతోషం**

నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ, ప్రజా సేవలో అంకిత భావంతో, అభివృద్ధి పట్ల నిబద్ధతతో పనిచేస్తున్న కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని తెలుగుదేశం పార్టీ అధిష్టానం తగిన గుర్తింపుతో గౌరవించిందని, పార్టీలో అతిముఖ్యమైన పొలిట్‌బ్యూరోలో సభ్యురాలిగా నియమించి ఆమె సేవలకు తగిన గుర్తింపు నిచ్చిందని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. నెల్లూరులో ఇటీవల ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలుపుకుంటూ, కార్యకర్తలుగా తాము పార్టీకి సేవలందిస్తామని తెలిపారు. ప్రజలకు సేవ చేసేందుకే తాము రాజకీయాల్లోకి వచ్చామన్నారు. పార్టీ మరియు కార్యకర్తల శ్రేయస్సే ధ్యేయంగా పనిచేస్తామన్నారు. ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ మహిళలకు నాయకత్వ బాధ్యతల్లో ప్రాధాన్యతనిస్తూ తనను పొలిట్‌బ్యూరో సభ్యురాలిగా నియమించినందుకు పార్టీ జాతీయ అధ్యక్షులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్, మరియు రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావులకు ధన్యవాదాలు తెలిపారు. వారి నాయకత్వంలో పార్టీలో ఒక సైనికురాలిగా పనిచేస్తానని ఆమె చెప్పారు.

## 21నుంచి..ఆదిశంకర
# జయంతి వేడుకలు



నెల్లూరులోని శ్రీ పినాకినీ విద్యాపీఠం ఆధ్వర్యంలో ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు జగద్గురు శ్రీ ఆదిశంకర జయంతి ఉత్సవాలను వైభవంగా నిర్వహించనున్నారు. స్థానిక ట్రంకురోడ్డులోని తిప్పరాజు వేంకట సుబ్బయ్య కళ్యాణ్‌సదన్‌లో జరిగే ఈ ఉత్సవాల్లో భాగంగా, ప్రతిరోజు ఉదయం మహాన్యాసపూర్వక ఏకాదశ పూర్ణావార రుద్రాభిషేకాలు, వేదపారాయణాలు, భాష్య ప్రవచనాలు జరుగుతాయి. 21న ప్రముఖ కవిపండితులు డా. సూరం శ్రీనివాసులు 'శంకర కృత పంచీకరణం' అనే అంశంపై ఉపన్యసించనున్నారని, 22న ప్రముఖ సాహితీవేత్త డా. శ్రీమతి గిరిజాలక్ష్మి 'శంకరాచార్య విరచిత దశ శ్లోకీ' అనే విషయంపై ప్రసంగిస్తారని విద్యాపీఠం గౌరవాధ్యక్షులు స్వయంపాకుల శ్రీనివాసులు, అధ్యక్ష కార్యదర్శులు దూబగుంట ప్రభాకరరావు, తొండపి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు.

23వ తేదీ ముదివర్తి లక్ష్మీకామాక్షి గాత్రకచేరీ ఉంటుందని, సాయంత్రం వేళల్లో ప్రదోషకాల పూజలు, ఆధ్యాత్మిక ఉపన్యాసాలు, వేదాశీర్వచనం ఉంటాయని, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని శ్రీ శంకర భగవత్పాదుల కృపాకటాక్షాలను పొందాలని నిర్వాహకులు ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.




# నెల్లూరు కబుర్లు

### బారాషహీద్ దర్గా..
## ముఖద్వారాలు ప్రారంభం



బారా షహీద్ దర్గా ముఖద్వారాలను ప్రారంభిస్తున్న కోటంరెడ్డి, అజీజ్

నెల్లూరులోని ప్రసిద్ధమైన బారాషహీద్ దర్గాలో సుమారు. 2 కోట్ల 30 లక్షల రూపాయలతో నిర్మించిన బారాషహీద్ దర్గా ముఖద్వారాలను ఇటీవల నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఛైర్మెన్ అబ్దుల్ అజీజ్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, యువనేత నారా లోకేష్, మంత్రి పొంగూరు నారాయణ, పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్‌ల సహకారంతో రూరల్ నియోజకవర్గ పరిధిలో ఉన్న బారాషహీద్ దర్గాను మరింతగా అభివృద్ధి చేస్తామన్నారు. అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ, 2014లో కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి విపక్షపార్టీ శాసనసభ్యుడిగా వేరే పార్టీలో ఉన్నా అభివృద్ధి విషయంలో ఎక్కడా రాజీ పడలేదన్నారు. కులాలకు మతాలకు అతీతంగా బారాషహీద్ దర్గాలో రొట్టెల పండుగ జరుగుతుందని, ప్రపంచవ్యాప్తంగా పేరొందిన ఈ దర్గాను అన్నివిధాలా అభివృద్ధి చేస్తామని తెలిపారు. డిప్యూటీ మేయర్ సయ్యద్ తహసీన్, ముస్లిం నాయకులు, ముస్లిం మతపెద్దలు తదితరులు పాల్గొన్నారు.


### ఫ్రెండ్స్ వాకర్స్ ఆధ్వర్యంలో..
## డా. అంబేద్కర్ జయంతి



డా. బి.ఆర్.అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వాకర్స్ ప్రతినిధులు

ఈనెల 14న డా.అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా నెల్లూరు ఏసీ స్టేడియంలోని ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డా. అంబేద్కర్ దేశానికి చేసిన సేవలను కొనియాడారు. అసోసియేషన్ అధ్యక్షులు షేక్ నసీర్ అహ్మద్, 203-గవర్నర్ నలుబోలు బలరామయ్యనాయుడు, గౌరవ అధ్యక్షులు బిరదవోలు రామ్మోహన్‌రెడ్డి, ఏకొల్లు రాఘవరెడ్డి, రావూరి సుబ్బారావు, కొండూరు సుబ్బారావు, సూరినేని శ్రీనివాసులునాయుడు, మాగంటి ప్రసాద్, యు.గోవర్ధన్, ఎం.మన్మోహన్, బి.భాస్కర్‌నాయుడు, ఎం.వెంకటేశ్వర్లు, మన్నేపల్లి సురేష్, యరమాక శ్రీనివాసులురెడ్డి, ఆరే చిన్నపుల్లయ్యనాయుడు, గంగినేని శ్రీనివాసులునాయుడు, పి.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం, ఎంజీఎఫ్‌గా 8 మంది సభ్యులు, సిల్వర్ డోనర్లుగా మరో ముగ్గురు సభ్యులు ఫెలోషిప్‌ను తీసుకున్నారని నిర్వాహకులు తెలిపారు.

### శాలరీ ప్యాకేజీ పట్ల..
## అవగాహన అవసరం
### ఉద్యోగులకు కలెక్టర్ సూచన



బాధిత కుటుంబానికి కోటి 10 లక్షల చెక్కును అందజేస్తున్న కలెక్టర్ హిమాన్షు

ఉద్యోగులందరూ ప్రభుత్వ శాలరీ ప్యాకేజీ స్కీంపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల చెప్పారు. పంచాయతీ సెక్రటరీగా విధులు నిర్వహిస్తూ మరణించిన భాస్కర్‌రావు కుటుంబానికి ఈనెల 13న కోటీ పది లక్షల రూపాయల చెక్కును కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, స్టేట్ బ్యాంకు వారు అందిస్తున్న స్టేట్ గవర్నమెంట్ శాలరీ ప్యాకేజీ స్కీమ్ ఎంతో ఉపయోగకరమైనదని, ఉద్యోగస్తులు ఆ స్కీమ్‌పట్ల అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా వారి ద్వారా యాక్సిడెంటల్ క్లెయిమ్ కింద కోటీ పది లక్షల రూపాయల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో డీపీఓ వసుమతి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ మేనేజర్ మురళి నాయక్, దర్గామిట్ట బ్రాంచ్ చీఫ్ మేనేజర్ హజరతయ్య, ఉదయ్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## అగ్నిప్రమాదాలతో జాగ్రత్తగా ఉండాలి



అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జేసీ వెంకటేశ్వర్లు

అగ్నిప్రమాదాలు జరగకుండా జాగ్రత్తగా ఉంటూ, అవగాహనతో ఆ ప్రమాదాలను నివారించవచ్చని జిల్లా జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు చెప్పారు. ఈనెల 14న నెల్లూరులోని అగ్నిమాపక కార్యాలయంలో జరిగిన అగ్నిమాపకశాఖ వారోత్సవాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రమాదాల సందర్భంలో అగ్నిమాపక సిబ్బంది ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రజల ప్రాణాలను కాపాడడానికి కృషి చేస్తారని ఆయన అన్నారు. తొలుత, అగ్నిప్రమాదాలపై అవగాహన కలిగించే పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈనెల 14 నుంచి 20వతేదీ వరకు జరుగుతున్న అగ్నిమాపక వారోత్సవాల్లో ప్రజలను చైతన్యవంతం చేస్తామని, అగ్నిప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తామని జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి వి.శ్రీనివాసులు తెలిపారు.

## ఆయన ఆదర్శాలు స్ఫూర్తిదాయకం
### - డీసీసీ నేత నారపరెడ్డి



డా. అంబేద్కర్ ఆదర్శాలు స్ఫూర్తిదాయకమని, దేశానికి మార్గదర్శకమని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నారపరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. నెల్లూరులోని వీఆర్‌సి కూడలివద్ద ఉన్న డా. అంబేద్కర్ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. కులవ్యవస్థ, అస్పృశ్యతలపై ఆయన అలుపెరుగని పోరాటం చేశారని, వారి ఆశయసాధనకు అందరూ కృషిచేయాలని అన్నారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు బాలసుధాకర్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## ఆదర్శప్రాయులు డా. అంబేద్కర్

భారతరత్న డా. అంబేద్కర్ జీవితం మార్గదర్శమని, భావితరానికి వారు జీవితం ఆదర్శమని జనసేన పార్టీ నగర అధ్యక్షుడు దుగ్గిశెట్టి అజయ్‌బాబు అన్నారు. డా. అంబేద్కర్ జయంతి సందర్భంగా నెల్లూరు వీఆర్‌సి సెంటర్‌లో ఉన్న డా. అంబేద్కర్ విగ్రహానికి జనసేన ఆధ్వర్యంలో వారు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డా. అంబేద్కర్ ఆశయాలను ఆయన వివరించారు.






## పెంచలయ్య సతీమణికి ఉద్యోగం
### ఎమ్మెల్యే కోటంరెడ్డిని అభినందించిన సీపీఎం నాయకులు



పెంచలయ్య సతీమణికి ఉద్యోగ నియామక పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

ఇటీవల గంజాయి ముఠాల చేతిలో దారుణహత్యకి గురైన సామాజిక చైతన్యకారుడు.. నెల్లూరు రూరల్ నివాసి పెంచలయ్య సతీమణికి ఉద్యోగం లభించింది. భర్త హత్యకు గురికావడంతో, భార్యబిడ్డలు పడుతున్న అవస్థలు గమనించిన రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి మానవతా హృదయంతో స్పందించి ఆ కుటుంబానికి తనవంతు చేయూతను అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో పెంచలయ్య సతీమణికి పంచాయతి రాజ్‌శాఖ సబార్డినేట్‌గా ఉద్యోగం లభించడంతో, అందుకు సహకరించిన నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిని ఈనెల 14న సీపీఎం నాయకుడు..మాజీ డెప్యూటీ మేయర్ మాదాల వెంకటేశ్వర్లు, పలువురు సీపీఎం నాయకులు అభినందించారు. పెంచలయ్య సతీమణి దుర్గ, పలువురు సీపీఎం నాయకులు శ్రీధర్‌రెడ్డిని కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ, పెంచలయ్య సతీమణికి ప్రభుత్వపరంగా రావాల్సిన ఇంటి స్థలం, ఇతరత్రా సదుపాయాలు కూడా త్వరలోనే అందేందుకు కృషిచేస్తానన్నారు.

## బ్రహ్మేశ్వరాలయంలో కలశపూజలు



కలశ పూజలు చేస్తున్న వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి

నెల్లూరు నగరంలోని హరనాథపురంలో ఉన్న శ్రీ వరసిద్ది వినాయక సుబ్రహ్మణ్యేశ్వర-పార్వతి సమేత బ్రహ్మేశ్వరాలయం నూతన రాజగోపుర శిఖర కలశ ప్రతిష్ఠ, మహాకుంభాభిషేక మహోత్సవం ఇటీవల వైభవంగా ప్రారంభమైంది. ఆలయ ఛైర్మెన్ వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో శైవాగమ పండిట్ బ్రహ్మశ్రీ నూతలపాటి సుబ్బయ్య శాస్త్రి, ఆలయ ప్రధాన అర్చకులు గాడేపల్లి ప్రశాంత్ శర్మ తదితరుల నేతృత్వంలో గణపతి పూజ, పుణ్యాహవచన, పంచగవ్యప్రాసన, రక్షా విధి తదితర క్రతువులు శాస్త్రోక్తంగా జరిగాయి. విజయభాస్కర్‌రెడ్డి కుటుంబసభ్యులతో పాటు పలువురు కంకణదారులై స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. ఋత్వికులు శిఖరాలకు శాస్త్రోక్తంగా అభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

## జ్యోతిరావు పూలే సేవలు మార్గదర్శకం



పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రెడ్‌క్రాస్ స్పాస్టిక్ సెంటర్ సభ్యులు

మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఇటీవల నెల్లూరు జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ ఎమ్మెస్సార్ స్పాస్టిక్స్ సెంటర్‌లో రెడ్ క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యులు, స్పాస్టిక్స్ సెంటర్ కోఆర్డినేటర్ దాసరి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో పూలే చిత్రపటానికి పూలమాలవేసి ఆయన సేవలను స్మరించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యనూ, జ్ఞాన సముపార్జనను జీవిత లక్ష్యాలుగా మలచుకున్న మహాత్మా పూలే దంపతులు.. అనేక కులాలకు అక్షరజ్ఞానం అందని ద్రాక్షగా ఉన్న నాటి కాలంలో బాలికల కోసం, విద్యావకాశాలు లేని వర్గాల కోసం పాఠశాలలను ప్రారంభించి విద్యా విప్లవానికి నాంది పలికారన్నారు. విద్య పట్ల వారి దార్శనికత స్ఫూర్తిదాయకమన్నారు. స్పాస్టిక్స్ సెంటర్ ప్రిన్సిపల్ ఎం.ఉదయ్‌భాస్కర్, రెడ్ క్రాస్ స్పాస్టిక్స్ సెంటర్ సిబ్బంది, చిన్నారులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# రాష్ట్రపతికి.. రాష్ట్ర నాయకుల కృతజ్ఞతలు

'అమరావతి'ని రాజధానిగా చేయడానికి అనుమతించిన భారత రాష్ట్రపతి ద్రౌపదిముర్ముకి ఆంధ్రరాష్ట్ర నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఇటీవల ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతిని కలిసి అమరావతి రాజధాని ప్రాశస్త్యాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో యువనేత, రాష్ట్ర విద్యామంత్రి లోకేష్‌తో పాటు పలువురు లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు పాల్గొన్నారు. వారిలో మన నెల్లూరు నాయకులు రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు, లోక్‌సభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఉన్నారు.

# జడ్పీలో కారుణ్య నియామకాలు

నెల్లూరు జిల్లా ప్రజా పరిషత్ యాజమాన్య పరిధిలో పనిచేస్తూ మరణించిన వారి కుటుంబసభ్యులు ఇద్దరికి ఆఫీస్ సబార్డినేట్‌లుగా కారుణ్య నియమాకాలు జరిగాయి. వారిలో ఒకరిని పెళ్ళకూరులోను, మరొకరిని కావలిలోను నియమిస్తూ ఈనెల 14న జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ తన ఛాంబర్‌లో నియామకపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా అరుణమ్మకి, సీఇఓ ఎల్.శ్రీధర్‌రెడ్డి, పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు లక్కాకుల పెంచలయ్య తదితరులకు వారు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా ఎమ్.రాజ్యలక్ష్మికి సీనియర్ సహాయకురాలిగా ఉద్యోగోన్నతి కల్పించారు.

# కృష్ణపట్నం పోర్ట్‌ను సందర్శించిన.. మంత్రి జనార్ధన్‌రెడ్డి

ముత్తుకూరు మండలంలోని అదాని కృష్ణపట్నం పోర్ట్‌ను రాష్ట్రపెట్టుబడులు–మౌలిక సదుపాయాల మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి ఈనెల 15న సందర్శించారు. పోర్టుకు సంబంధించిన వివరాలను అక్కడి అధికారును అడిగి తెలుసుకున్నారు. పోర్టు కార్యకలాపాల విస్తరణ, కంటైనర్ టెర్మినల్ పునరుద్ధరణ మరియు మౌలిక సదుపాయాల కల్పనపై వంటి అంశాలపై వారితో ఆయన చర్చించారు. ఈ సందర్బంగా ఆయన నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్యలతో, సీఈ రాఘవరావు, పోర్టు ప్రతినిధులతో కలిసి ఆయన షిప్‌లో ప్రయాణించారు. ఏపీ ఇన్ లాండ్ వాటర్ వేస్ అథారిటీ చైర్మన్ డాక్టర్ జెడ్.శివప్రసాద్, ఏపీ కనీస సలహా వేతనమండలి చైర్మన్ పెళ్లకూరు శ్రీనివాసులు రెడ్డి తదితరులు కూడా ఉన్నారు. తొలుత, పోర్టు సీఈఓ జగదీష్ పటేల్ వారిని సాదరంగా స్వాగతించారు. పోర్టు ప్రగతిని, కార్యకలాపాలను వారికి వివరించారు. కార్పొరేట్ ఆఫైర్స్ హెడ్ మృత్యుంజయరామ్ తదితరులు పాల్గొన్నారు.




# ఇంటర్ ఫలితాల్లో 'విశ్వసాయి' ప్రభంజనం

రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 15న ప్రకటించిన ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాల్లో నెల్లూరులోని విశ్వసాయి జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించి కళాశాల ప్రతిభను చాటారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీలో 470 మార్కులకు గాను యం.వెంకట చేతన్ శ్రీధర్‌రెడ్డి 468 మార్కులు సాధించి స్టేట్ ఫస్ట్ సాధించాడు. అదేవిధంగా, ఇ.సంకీర్తన 467 మార్కులు, టి.మోక్షికరెడ్డి 467, ఇ.తన్విక 466, పి.గౌతమ్‌రెడ్డి 466 మార్కులు సాధించగా, 460 మార్కులకు పైగా మరో 86 మంది విద్యార్థులు సాధించారు.



విద్యార్థులతో కలిసి విజయసంకేతాన్ని చూపుతున్న కళాశాల ఛైర్మెన్ డా. ఎన్.సత్యనారాయణ

బైపీసీలో 455 మార్కులకు గాను తుమ్మల లలిత 452, తేజశ్విని 450, షేక్ జువేరియా 450, వి.గాయత్రి 450 మార్కులు సాధించారు. మరో 49 మంది 445కి పైగానే ఉత్తమ ఫలితాలు సాధించారు. సీనియర్ ఇంటర్మీడియట్ ఎంపీసీలో 1000 మార్కులకుగాను సిహెచ్ శరణ్య 988, జి.జనార్ధన 988, జి.పవన్ కుమార్‌రెడ్డి 987 మార్కుల వంతున సాధించగా,43 మంది విద్యార్థులు 980కిపైగా మార్కులు సాధించారు. బైపీసీలో 1000 మార్కులకు గాను షేక్ తస్లిమ్ 990 మార్కులు, యస్.సాయి మహిక 989, వై.వెంకటరేవంత్‌రెడ్డి 988 మార్కుల వంతున సాధించగా, 35 మందికి పైగా విద్యార్థులు 980 మార్కులకు పైగానే సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులను, వారి తల్లితండ్రులను కళాశాల ఛైర్మెన్ డా.ఎన్ సత్యనారాయణ, వైస్ ఛైర్మెన్ జి.కృష్ణమోహన్, డైరెక్టర్ శివసంకేత్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు. ఇదే స్ఫూర్తితో మరింత ఉన్నత చదువుల్లోనూ విజయాలు సాధించాలని వారందరికీ శుభాభినందనలు తెలియజేశారు. తమ కళాశాలలో 5 స్టెప్ ప్రోగ్రామ్, ఒత్తిడిలేని భోదన, ప్రణాళికాయుతమైన విధానాలు పాటించడం వలననే విశ్వసాయి కళాశాల అద్భుత ఫలితాలు సాధించగలుగుతోందని వారు స్పష్టం చేశారు.







# జయభారత్'లో..రక్తదాన శిబిరం



నెల్లూరులోని జయభారత్ హాస్పిటల్ ప్రాంగణంలో ఈనెల 14న రక్తదాన శిబిరం నిర్వహించారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా సింహపురి వైద్య సేవాసమితి ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో ముఖ్యఅతిథిగా డాక్టర్ బాబు (డీడియం నాబార్డ్), ఆర్‌ఎస్ఎస్ సంఘచాలకులు నాగారెడ్డి హరికుమార్ రెడ్డి, హాస్పిటల్ సీఎండి ఓబులేష్, చారిటబుల్ ట్రస్ట్ జెపి జైన్, డిఎస్ఆర్ ట్రస్టు సీఈఓ అనిల్ కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఈ శిబిరంలో 53 మంది రక్తదానం చేశారు. జయభారత్ హాస్పిటల్ జనరల్ మేనేజర్ గురుప్రసాద్, రాష్ట్ర నాయకులు వల్లూరు సత్యనారాయణ, గిరిజన నాయకులు హాస్పిటల్ డిప్యూటీ మేనేజర్ వెంకటేష్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని హరికుమార్‌రెడ్డి ప్రారంభించారు.


12వ వర్ధంతి



మానవత్వానికి ప్రతిరూపంలా నిలిచారు, దాతృత్వంతో అందరి మనసులు గెలిచారు,
శ్రమించే తత్వానికి ప్రతిబింబం మీరు... మంచిని పంచే వ్యక్తిత్వానికి పెట్టింది మీ పేరు.
మా ఉన్నతికి బాటలువేసి, మా బంగారు భవిష్యత్‌కు మార్గదర్శకులుగా నిలిచిన మా ఇంటి దైవం
కీ॥శే॥ చెరుకుపల్లి పిచ్చిరెడ్డి గారు
అధినేత: సిపిఆర్ కళ్యాణ మండపం, శివప్రియ లాడ్జి
పరమపదించి తేది.18.04.2026 నాటికి పన్నెండేళ్ళు గడుస్తాయి.
వారి దివ్యస్మృతికి మా నివాళులు.

భార్య: సుబ్బరత్నమ్మ
కుమారుడు - కోడలు: చెరుకుపల్లి పద్మనారాయణరెడ్డి - సుమతి
మనుమలు: హరీశ్వర్‌రెడ్డి - సుస్మిత, భువనేశ్వర్‌రెడ్డి
మునిమనుమడు : దర్శివిన్
మరియు బంధుమిత్రులు

# గూడూరు డివిజన్

## అగ్ని ప్రమాదాల పట్ల జాగ్రత్తగా ఉండాలి



అగ్నిమాపక వారోత్సవాలని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రభుత్వం ప్రతి సంవత్సరం అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహిస్తుందని, ప్రజలందరూ అవగాహన పెంచుకోవాలని గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ వెల్లడించారు. గూడూరు పట్టణంలోని అగ్నిమాపక కేంద్రం వద్ద అగ్నిమాపక వారోత్సవాలను ఎమ్మెల్యే, ఆర్డీవో సత్యనారాయణతో కలిసి ప్రారంభించారు. అగ్నిమాపక పరికరాలను పరిశీలించారు. వాటి పనితీరును అడిగి తెలుసుకున్నారు. జాగ్రత్తలు తెలియజేస్తూ ముద్రించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీల్‌కుమార్ మాట్లాడుతూ అగ్ని ప్రమాదాల్లో ప్రాణ, ఆస్తి నష్టం నివారించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రజలు అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఆర్డీవో సత్యనారాయణ మాట్లాడుతూ వేసవి కాలం కావడంతో అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. అగ్నిమాపక శాఖ అధికారి రమణయ్య, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, భారతి, గురవయ్య, హనుమంతరావు పాల్గొన్నారు.

## నేరాల నియంత్రణే లక్ష్యంగా కార్డన్ సెర్చ్



కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్న గూడూరు పట్టణ, రూరల్ పోలీసు సిబ్బంది

గూడూరు పట్టణంలోని బనికిసాహెబ్‌పేటలో గూడూరు పట్టణ, రూరల్ సర్కిల్ పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గూడూరు ఒకటవ పట్టణ సి.ఐ శేఖర్‌బాబు మాట్లాడుతూ నేరాల నియంత్రణకే కార్డన్ సెర్చ్‌ను నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఆపరేషన్‌లో సుమారు 200 ఇళ్లలో సోదాలు నిర్వహించామన్నారు. 10 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. రహదారి భద్రత, సైబర్ నేరాల నివారణపై విద్యార్థులు, స్థానికులుకు అవగాహన కల్పించామన్నారు. ఎస్.ఐలు తిరుపతయ్య, సురేష్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

## టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎమ్మెల్యే సునీల్‌కుమార్



రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శిగా గూడూరు ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్‌కుమార్‌కి రాష్ట్ర నూతన కమిటీలో పార్టీ అధిష్ఠానవర్గం అవకాశం కల్పించింది. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి, యువనేత, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా టీడీపీ అధ్యక్షులు బీద రవిచంద్ర, నాయకుడు గంగా ప్రసాద్, తానంకి నానాజీకి ఆయన ప్రత్యేక అభినందనలు తెలిపారు. అదేవిధంగా రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శిగా మట్టం శ్రావణి, రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా బిల్లు చెంచురామయ్యలకు అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు పార్టీ పదవులు పొందినవారికి శుభాకాంక్షలు తెలియజేశారు.

## డా. అంబేద్కర్ భావితరాలకు స్ఫూర్తి

### • ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్



అంబేద్కర్ జయంతి సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ భావితరాలకు స్ఫూర్తి అని గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ పేర్కొన్నారు. గూడూరు పట్టణంలోని ఒకటవ వార్డు రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద సీనియర్ నాయకులు గోను శివకుమార్ ఆధ్వర్యంలో ఈ నెల 14న అంబేద్కర్ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ హాజరయ్యారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే సునీల్‌కుమార్ మాట్లాడుతూ ప్రపంచ మేధావి అంబేద్కర్ కల్పించిన హక్కుల వల్లే నేడు ఈ స్థాయిలో ఉన్నానని తెలిపారు. సీనియర్ నాయకులు శివ కుమార్ చిన్నతనం నుండి మమ్మల్ని ఎంతో ప్రోత్సహించారని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, అరవ పార్వతయ్య, చింతల చిరంజీవి, విక్రమ్, శివకుమార్, రవికృష్ణ, ప్రసాద్, శివ, మురళి, శ్రీనివాసులు, భారతి పాల్గొన్నారు.

అనంతరం, గూడూరు పట్టణంలోని వాటర్ ట్యాంక్ వద్ద అంబేద్కర్ సేవా సంఘం ఆధ్వర్యంలో 135వ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే సునీల్‌కుమార్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ పాట లకు మహిళల కోలాట ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అంబేద్కర్ చిత్ర పటాలను అందజేశారు. దివ్యాంగులకు వీల్‌చైర్ మరియు వాకింగ్ స్టిక్స్ పంపిణీ చేశారు.

అదేవిధంగా గూడూరు పట్టణంలోని టవర్‌క్లాక్ సెంటర్ వద్ద డి.వి.ఎం.సి అధ్వర్యంలో అంబేద్కర్ జయంతి వేడుకలను నిర్వహించారు. అనంతరం మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ సభ్యులు ఏసుపాక పెంచలయ్య, రావూరు సురేంద్ర, ఎం.వెంకటేశ్వర్లు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రాంతీయ ఏరియా ఆసుపత్రి నందు అంబేద్కర్ 135 వ జయంతి సందర్భంగా రక్తదాన శిబిరంను ఏర్పాటు చేశారు.

## ఆదర్శప్రాయుడు అంబేద్కర్ - ఎంపీడీవో



అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీడీవో మధుసూదన్‌రావు

గూడూరు పట్టణ పరిధిలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో అంబేద్కర్ 135వ జయంతి వేడుకలను ఈనెల 14న ఘనంగా నిర్వహించారు. ఎంపిడివో కార్యాలయంలో గూడూరు ఎంపీపీ గురవయ్య, ఎంపిడివో మధుసూదన్‌రావు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ సమాజానికి ఆదర్శప్రాయుడని కొనియాడారు. ప్రతి ఒక్కరూ ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యాలయ సిబ్బంది అనుదీప్, వెంకటేశ్వర్లు, మస్తానయ్య పాల్గొన్నారు.




## సామాజిక సంస్కర్త..
# మహాత్మా జ్యోతిరావు పూలే



పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సమరసత వేదిక సభ్యులు

సామాజిక సంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే 200వ జయంతి సందర్భంగా ఇటీవల నెల్లూరు బాలాజీనగర్ కూడలిలోని మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహాన్ని నెల్లూరు జిల్లా సామాజిక సమరసత వేదిక ఆధ్వర్యంలో పూలమాలలతో అలంకరించారు. స్థానిక ప్రముఖులు కోడూరు సత్యం మాట్లాడుతూ మహాత్మ జ్యోతి రావు పూలే బడుగు బలహీనవర్గాల వారికి చేసిన సేవలను, స్త్రీల విద్య కోసం చేసిన కృషిని కొనియాడారు. ఎంఈఓ మురళి, మోవిడి శ్రీనివాసులు, పోలయ్య, జయప్రకాష్, శీనమ్మ, నిరోషా, దాసరి రాజేంద్ర, డాక్టర్ సతీష్, లక్ష్మీనారాయణ గోళ్ల కేశవులు, పలువురు విశ్రాంతి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నెల్లూరు కవయిత్రికి..
# జర్మనీలో సన్మానం



సత్కారాన్నందుకుంటున్న ములుగు లక్ష్మీమైథిలి

జర్మనీలో ఇటీవల జరిగిన కార్యక్రమంలో నెల్లూరుకు చెందిన కవయిత్రి ములుగు లక్ష్మీమైథిలి రచనలను మెచ్చుకుని ఆమెను అభినందించడం విశేషం. 'మన తెలుగు సంఘం-జర్మనీ' వారి ఆధ్వర్యంలో ఆ సంఘం వైస్‌ప్రెసిడెంట్ అనిల్ కుందేటి, శ్రవణ్ తదితరుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆమె కవితాగానం చేశారు. ఈ సందర్భంగా ఆమెను ఆ సంఘం వారు సన్మానించారు. అనంతరం ఆమె ఆ సంఘం వారికి ధన్యవాదాలు తెలిపారు.

# 26న..వేద విజ్ఞాన వేదిక సభ

చెన్నైలోని వేద విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జరుగుతున్న తర తరాల తెలుగు కవిత ఉపన్యాస ధారావాహికలో భాగంగా, ఈ నెల 26న 172వ ప్రసంగ కార్యక్రమం జరుగుతుందని వేదిక అధ్యక్ష కార్యదర్శులు జెకె రెడ్డి, కందనూరు మధు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసే సభలో ప్రముఖ సాహితీ వేత్త, హైదరాబాదుకు చెందిన ఓలేటి పార్వతీశం 'భావ కవితా వైతాళికులు వేంకట పార్వతీశ కవులు' అనే అంశంపై ప్రసంగిస్తా రని పేర్కొన్నారు. చెన్నై కృష్ణాహోల్-ఆంధ్రాక్లబ్‌లో ఆరోజు సాయంత్రం 6.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ సభలో సాహి త్యాభిమానులందరూ పాల్గొనాలని వారు విజ్ఞప్తి చేశారు.

## వైద్య ఆరోగ్యశాఖలో..
# ఉద్యోగోన్నతులు కల్పించాలి

వైద్య ఆరోగ్యశాఖలో హెల్త్ ఎడ్యుకేటర్ పేరుతో ప్రస్తుతం డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్‌లుగా సేవలందిస్తున్న వారం దరూ ఉద్యోగోన్నతి లేకుండానే రిటైరవుతున్నారని, ఇకనైనా వారికి ఉద్యోగోన్నతులు కల్పించాలని ఏపీ డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరమణ కోరారు. నెల్లూరు, హరనాథపురంలోని ఆ సంఘం కార్యాలయంలో ఇటీవల జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యో గోన్నతుల కల్పనకు ప్రభుత్వ ఉన్నతాధికారులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేజర్ల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# సరస్వతీ శిశుమందిర్‌కి..50వేల విరాళం

నెల్లూరులోని 'లయన్స్ క్లబ్ ఆఫ్ ప్రతిభ' పూర్వ అధ్యక్షుడు కొండా సత్యనారాయణ స్థానిక సరస్వతీ శిశుమందిర్‌కి ఇటీవల 50వేల రూపాయలు విరాళంగా అందజేశారు.

## 'యుద్ధం-ఒక గుండెకోత'పై..
# 19న కవిసమ్మేళనం

నెల్లూరులోని చిన్ని నారాయణరావు సాహితీ ఫౌండేషన్, పెన్నా రచయితల సంఘం (పెరసం) కార్యదర్శి గోవిందరాజు సుభద్రాదేవిల సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 19వ తేదీ ఆదివారం ఉదయం 10.30 గంటలకు 'యుద్ధం-ఒక గుండెకోత' అనే అంశంపై కవిసమ్మేళనం జరుగుతుందని కళారత్న చిన్ని నారాయణరావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ కవి గుమ్మా సాంబశివరావు అధ్యక్షత వహిస్తారని, నెల్లూరు జిల్లా రచయితల సంఘం (నెరసం) కార్యదర్శి పాతూరి అన్నపూర్ణ, పెరసం అధ్యక్షులు అవ్వారు శ్రీధరబాబు వక్తలుగా పాల్గొంటారని తెలిపారు. స్థానిక 'హోటల్ అతిథి'లో జరిగే ఈ కార్యక్రమంలో కవులందరూ పాల్గొని కవితోత్సవ సగారా మోగించాలని వారు కోరారు.

## హాస్టళ్ళకి..యూనియన్ బ్యాంక్
# టీవీల వితరణ



టీవీలను అందజేస్తున్న యూనియన్ బ్యాంక్ అధికారులు

భారత రాజ్యాంగ నిర్మాత డా. బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా నెల్లూరులోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎస్సీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో చేస్తున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా, నగరంలోని పలు బాలికల హాస్టళ్ళకు 32 అంగుళాలున్న 4 ఎల్ఇడి టీవీలను అందజేశారు. సెలవు రోజుల్లో విద్యార్థినులకు ప్రోత్సాహంగా ఉండేందుకు వాటిని అందజేస్తున్నామని వారు తెలిపారు. యూని యన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిప్యూటీ రీజినల్ హెడ్ శివశంకర్, అసోసియేషన్ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ ఎం.రాజశేఖర్, సీనియర్ లీడర్ డి.రూప్‌ప్రకాష్, ట్రెజరర్ రవీంద్ర, సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ కె.శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

## క్యాన్సర్ వ్యాధుల పట్ల..
# యువత అప్రమత్తంగా ఉండాలి

క్యాన్సర్ వ్యాధుల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని నెల్లూరులోని మెడికవర్ హాస్పిటల్ కన్సల్టెంటెంట్ మెడికల్ అంకాలజిస్ట్ డాక్టర్ జి.రంగరామన్ చెప్పారు. జీవనశైలిలో వస్తున్న మార్పులు, అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, వ్యాయామం లేకపోవడం తదితర కారణాల వల్ల ముఖ్యంగా పేగు క్యాన్సర్ (కోలన్ క్యాన్సర్) వ్యాధులు విజృంభిస్తున్నాయని, సాధారణంగా 50ఏళ్ల పైబడినవారిలో వచ్చే ఈ వ్యాధులు ఇప్పుడు 30 ఏళ్ళ యువతకు కూడా సంక్రమిస్తున్నాయని ఆయన హెచ్చరించారు. మలవిసర్జనలో మార్పులు, మలంలో రక్తం పడడం, కడుపునొప్పి, అలసట, బరువు తగ్గడం వంటివి ఈ వ్యాధి లక్షణాలని, వాటిని నిర్లక్ష్యం చేయకుండా బాధితులు వెంటనే వైద్యులను సంప్రదించాలని తెలిపారు.

# నీటిపారుదల ప్రాజెక్టులకు నిధులేవీ?

• రైతు సంఘం నేత జనార్ధన్

రాష్ట్రంలో ఏళ్ళ తరబడిగా అనేక నీటిపారుదల ప్రాజెక్టులు నేటికీ అసంపూర్తిగానే ఉన్నాయని, దేశానికి రైతే రాజు అంటారే తప్ప, రైతుల సమస్యలు పట్టించుకోకపోవడం, రైతుల కోసమంటూ ప్రత్యేక బడ్జెటు ఏమీ లేకపోవడం విచారకర మని జిల్లా రైతు సంఘం నాయకుడు పి.జనార్దన్ విమర్శించారు. ఆలిండియా కిసాన్‌సభ 90వ వార్షికోత్సవం సందర్భంగా, ఇటీవల నెల్లూరు రూరల్‌లోని పాతవెల్లంటి గ్రామంలో జరిగిన ఆ సంఘం పతాకావిష్కరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, దేశంలో అనేక పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నా కేంద్రం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. జిల్లాలోని సోమశిల ప్రాజెక్టుకు చెందిన ఆఫ్రాన్ దెబ్బతిని ఐదేళ్ళు గడుస్తున్నా ఇప్పటికీ దానిని బాగుచేసే విషయంలో ప్రభుత్వం అశ్రద్ధగానే ఉందని, ఏళ్ల గడుస్తున్నా వెలిగొండ ప్రాజెక్టు పూర్తి కానే లేదని ఆయన విమర్శించారు. కౌలురైతుల సంఘం నాయకుడు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# మంచి మార్కులు రావాలంటే..ఏం చేయాలి?

జ్ఞాన నేత్రం
డా. నరసింహారెడ్డి ఊరిమిండి
Dallas, Texas, USA

**పరీక్షల్లో మంచి మార్కులు రాబట్టు కోవాలంటే ఏంచేయాలి?.. అన్నది విద్యార్థులకు సహజంగానే ఒక ప్రశ్నగా ఉంటోంది. అయితే.. అందుకు తగ్గ ప్రతిభా పాటవాలను అలవరుచుకుంటే అదేమంత కష్టంకాదు. అయితే, చదివిన దాన్ని ఎలా రాయాలి అన్నది సాధన చేయాలి. ఒకే విషయం చదివిన ఇద్దరు విద్యార్థుల్లో ఒకరికి ఎక్కువ మార్కులు రావడం, మరొకరికి తక్కువ రావడం వెనుక ఉన్న రహస్యం..సమాధానం రాసే విధానమే. వాక్యనిర్మాణం, ముఖ్యాంశాలు స్పష్టంగా ఉండాలి. గురువు సమాధానం చదివినప్పుడు, అవి అర్థమవ్వాలి. ఇవన్నీ ఉన్నప్పుడు మార్కులు సహజంగానే పెరుగుతాయి. ఎంతగా చదివినా సరైన విధంగా రాయడం రాకపోతే ఫలితం తగ్గిపోతుందని గుర్తుంచుకోవాలి.**

నిజం చెప్పాలంటే, ప్రశ్నలకి..సమాధానం రాయడం కూడా ఒక కళ. ఆ కళలో మొదటి నియమం..ప్రశ్నను పూర్తిగా అర్థం చేసుకోవడం. చాలామంది విద్యార్థులు ప్రశ్నను సగం చదివి వెంటనే రాయడం మొదలుపెడతారు. కానీ ప్రశ్నలో 'ఎందుకు', 'ఎలా', 'ఏమిటి', "వివరించండి", "తులన చేయండి" వంటి పదాలు ఉంటే, వాటి అర్థం మారుతుంది. ఉదాహరణకు, 'నీటి చక్రాన్ని వివరించండి' అంటే ఒక విధమైన సమాధానం; 'నీటి చక్రం ఎందుకు ముఖ్యమో చెప్పండి' అంటే మరో విధమైన సమాధానం. ప్రశ్నను అర్థం చేసుకోకుండా రాసిన సమాధానం ఎంత పొడవుగా ఉన్నా, గురువు దానిని పూర్తిగా అంచనా వేయలేదు. సమాధానం రాయడంలో రెండో ముఖ్యమైన అంశం..ప్రవేశిక. ప్రవేశిక అనేది సమాధానానికి ముఖద్వారం. అది స్పష్టంగా, సంక్షిప్తంగా, ప్రశ్నకు నేరుగా సంబంధించినట్లుగా ఉండాలి. ఉదాహరణకు, "భారత రాజ్యాంగం లక్షణాలు ఏమిటి?' అనే ప్రశ్నకు, 'భారత రాజ్యాంగం ప్రపంచంలోనే అత్యంత విస్తృతమైన, సమగ్ర రాజ్యాంగాలలో ఒకటి' అనే వాక్యంతో ప్రారంభిస్తే, గురువుకు వెంటనే విషయం స్పష్టమవుతుంది. ప్రవేశికలో ఎక్కువ వివరాలు అవసరం లేదు; కానీ దిశ మాత్రం స్పష్టంగా ఉం డాలి. ప్రవేశిక బలంగా ఉంటే సమాధానం కూడా బలంగా కని పిస్తుంది.

### సమాధానాలు సూటిగా..స్పష్టంగా ఉండాలి :

సమాధానంలో ప్రధాన భాగం రాయడం అంటే విషయాన్ని సక్రమంగా అమర్చడం. గురువు సమాధానం చదివినప్పుడు, ముఖ్యాంశాలు స్పష్టంగా కనిపించాలి. వాక్యాలు పొడవుగా కాకుండా, అర్థవంతంగా, సూటిగా ఉండాలి. ఉదాహరణకు, "పర్యావరణ కాలుష్యం రకాలు" అనే ప్రశ్నకు, గాలి కాలుష్యం, నీటి కాలుష్యం, నేల కాలుష్యం వంటి అంశాలను వరుసగా వివరించడం ఉత్తమం. ప్రతి అంశాన్ని ఒక చిన్న ఉదాహరణతో చెప్పడం సమాధానాన్ని మరింత బలపరుస్తుంది. ఉదాహరణకు, "గాలి కాలుష్యం ప్రధానంగా వాహనాల పొగ, పరిశ్రమల ఉద్గా రాల వల్ల ఏర్పడుతుంది" అని రాస్తే, గురువుకు విషయం స్పష్టంగా అర్థమవుతుంది. సమాధానం రాయడంలో మరో ముఖ్యమైన అంశం..భాష. భాష సులభంగా, స్పష్టంగా, పాఠ్యపుస్తక శైలికి దగ్గరగా ఉండాలి. అతి క్లిష్టమైన పదాలు, అతి పొడవైన వాక్యాలు, అర్థం కాని అలంకారాలు అవసరం లేదు. సూటిగా రాసిన సమాధానం గురువుకు నచ్చుతుంది. అర్థం కాని అలంకారాలు మార్కులు తగ్గిస్తాయి.సమాధానం రాయడం అనేది కేవలం వాక్యాల సమాహారం కాదు. అదిఆలోచనను క్రమబద్ధం చేసే సాధనం. "విద్యార్థి విషయాన్ని లోతుగా అర్థం చేసుకున్నాడు' అనే భావం గురువుకు కలిగితేనే మార్కులు పెరుగుతాయని గమనించాల్సి ఉంది.

### ముగింపు కూడా ముఖ్యమే మరి!...


సమాధానానికి ముగింపు కూడా అంతే ముఖ్యమైనది. ముగింపు అనేది సమాధానానికి ఒక ముద్ర. అది ప్రశ్నను తిరిగి గుర్తుచేస్తూ, ప్రధాన భావాన్ని ఒక వాక్యంలో చెప్పాలి. ఉదాహరణకు, "నీటి చక్రం ప్రకృతిలో సమతుల్యతను కాపాడే కీలక ప్రక్రియ" అని ముగిస్తే, సమాధానం పూర్తిగా అనిపిస్తుంది. ముగింపు లేకుండా ఉంటే, సమాధానం అసంపూర్ణంగా కనిపిస్తుంది. చివరి వాక్యం గురువుపై మంచి ప్రభావం చూపుతుంది. ఓ చిన్న ఉదాహరణ చూద్దాం. "సౌరశక్తి ప్రయోజనాలు వివరించండి'..అనే ప్రశ్నకి బలమైన సమాధానం ఇలా ప్రారంభమవుతుంది:.."సౌరశక్తి అనేది సూర్యుని నుండి లభించే శుద్ధమైన, పునరుత్పత్తి అయ్యే శక్తి'. ఆ తర్వాత ప్రయోజనాలను వరుసగా, స్పష్టంగా వివరించాలి. ఇది కాలుష్యం కలిగించదు, ఇది ఉచితం, ఇది భవిష్యత్తుకు స్థిరమైన శక్తి వనరు. ప్రతి ప్రయోజనానికి ఒక చిన్న ఉదాహరణ ఇవ్వాలి: "ఇంటి పైకప్పులపై సౌర ప్యానెల్స్ అమర్చడం ద్వారా విద్యుత్ ఖర్చు తగ్గుతుంది." అనే వివరాలు రాయాలి. చివరగా, "సౌరశక్తి భవిష్యత్తు శక్తి అవసరాలను తీర్చగల అత్యంత శ్రేయస్కరమైన మార్గం" అని ముగిస్తే, సమాధానం పూర్తిగా సరిపోతుంది. నిజానికి సమాధానం రాయడం అనేది కేవలం పరీక్షల కోసం కాదు; అది ఆలోచనను క్రమబద్ధం చేసే శక్తి. సరైన రీతిలో రాయడం నేర్చుకున్న విద్యార్థి, జీవితంలో కూడా తన ఆలోచనలను స్పష్టంగా వ్యక్తపరచగలడు. "రాయడం అంటే..ఆలోచనకు రూపం ఇవ్వడం" అన్నమాట. పరీక్షల్లో అధిక మార్కులు రావడం అనేది కేవలం అదృష్టం కాదు; అది సిద్ధత, స్పష్టత, క్రమబద్ధత, మరియు రాయడం అనే కళను అర్థం చేసుకోవడం. ఈ కళను నేర్చుకున్న విద్యార్థి ఏ పరీక్షలోనైనా బాగా రాణిస్తాడు.



**వచ్చే వారం:** పరీక్షా వ్యూహం : తెలివిగా సిద్ధం కావడం.

E-mail: reddyu@gmail.com





## ప్రజయ్ - జాహ్నవి

నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటి ఛైర్మెన్, టీడీపీ సీనియర్ నాయకులు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి - సంధ్యల కుమారుడు **డా॥ శ్రీ సాయి ప్రజయ్‌సేనారెడ్డి - డా॥ జాహ్నవి** (తమిళనాడు వాస్తవ్యులు టి.వెంకట శశిమోహన్ - పి.శోభారాణిల కుమార్తెల పరిణయం ఏప్రిల్ 12న తిరుపతిలో, రిసెప్షన్ 15న నెల్లూరులో వేడుకగా జరిగాయి. పెళ్లి వేడుకకి నందమూరి బాలకృష్ణ హాజరై వధూవరులను ఆశీర్వదించగా, రిసెప్షన్‌కి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ హాజరై వధూవరులకి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ రెండు వేడుకలలో అనేకమంది రాజకీయ, రాజకీయేతర ప్రముఖులు హాజరై కొత్త జంటను దీవించారు. నవ దంపతులకి 'లాయర్' శుభాశీస్సులు.

### మన వెంకయ్య చేతులమీదుగా

# 'ఉపదేశామృత తరంగిణి' గ్రంథావిష్కరణ



'ఉపదేశామృత తరంగిణి' గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న ముప్పవరపు వెంకయ్యనాయుడు

భారత పూర్వఉపరాష్ట్రపతి శ్రీ ముప్పవరపు వెంకయ్యనాయుడి గురువుగారైన స్వర్గీయ పోలూరి హనుమజ్జానకీరామశర్మ కర్తృత్వంలో రూపొందిన 'ఉపదేశామృత తరంగిణి' పునర్ముద్రణ గ్రంథాన్ని చెన్నైలోని లోక్‌భవన్‌లో ఈనెల 12న ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తమ గురువు స్మృతికి పూర్వ ఉపరాష్ట్రపతి నివాళులర్పించారు. కుర్తాళం శ్రీ సిద్ధేశ్వరి పీఠం ప్రథమ పీఠాధిపతులు శ్రీ విమలానంద భారతి వారి ఉపన్యాసాలను శ్రీ పోలూరి హనుమజ్జానకీరామశర్మ సాధారణ ప్రజల కోసం పుస్తకం రూపంలో తీసుకొచ్చారు. ఏటా వారి జయంతిని పురస్కరించుకుని, వారి కుటుంబసభ్యులు ఏర్పాటు చేసిన బ్రహ్మశ్రీ పోలూరి హనుమజ్జానకీ రామశర్మ స్మారక ట్రస్ట్ ద్వారా వారి సాహిత్యాన్ని పునర్ముద్రిస్తున్నారు కూడా. చెన్నపురి తెలుగు అకాడెమి వ్యవస్థాపక అధ్యక్షులు తూమాటి సంజీవరావు సంపాదకత్వంలో పునర్ముద్రించిన ఈ పుస్తకాన్ని, వెంకయ్యనాయుడు ఆవిష్కరించడం ద్వారా తమ గురుభక్తిని చాటుకున్నారు. ఈ గ్రంథాన్ని ఆకర్షణీయంగా పునర్ముద్రించిన వారి కుటుంబసభ్యులను, సంపాదకత్వ బాధ్యతలు వహించిన తూమాటి సంజీవరావును వెంకయ్యనాయుడు అభినందించారు. ఆధ్యాత్మిక జ్ఞానాన్ని సామాన్యులకు సైతం అర్థం అయ్యే విధంగా పోలూరు వారు 'ఉపదేశామృత తరంగిణి' పుస్తకానికి రూపకల్పన చేసిన తీరు మహోన్నతమంటూ వెంకయ్యనాయుడు కొనియాడారు. పోలూరి హనుమజ్జానకీ రామశర్మ నైపుణ్యం, అనుభవం, ఆధ్యాత్మిక మార్గంలో వారి వైశిష్ట్యానికి ఈ పుస్తకం ఒక చక్కని ఉదాహరణ అని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా యువతరానికి ఈ పుస్తకాన్ని చేరువచేసే విధంగా చొరవ తీసుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

# మహిళా బిల్లు..చరిత్రాత్మకం

- **కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి**



కేంద్రంలోని ఎన్డిఏ కూటమి ప్రభుత్వం మహిళలకు చట్టసభల్లో 33శాతం రిజర్వేషన్ కల్పిస్తూ 'నారీ శక్తి వందన్ అధినియం' బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టనున్న నేపథ్యంలో స్థానిక తెలుగుదేశం, బిజెపి మరియు జనసేన మహిళా నాయకులతో కలిసి ఇటీవల నెల్లూరు మాగుంట లేఅవుట్‌లోని తమ కార్యాలయంలో ఆమె విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో నందమూరి తారక రామారావు మహిళలకు ఆస్తి హక్కు కల్పించి విప్లవాత్మక మార్పుకు నాంది పలికారని, అదే బాటలో చంద్రబాబునాయుడు మహిళల ఆర్థిక స్వావలంబనకు అడుగులు వేశారన్నారు. ఇప్పుడు దశాబ్దాల నిరీక్షణకు తెరదించుతూ భారత పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిర్ణయం దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. చట్టసభల్లో మహిళా ప్రాతినిధ్యం పెరగడం దేశాభివృద్ధికి శుభపరిణామమంటూ ఆమె ప్రధాని మోడీకి, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి ధన్యవాదాలు తెలిపారు.

# శ్రీవారి బ్రహ్మోత్సవాలకి రండి!





ఏప్రిల్ 30వ తేదీ నుండి మే 10వ తేదీ వరకు దేశ రాజధాని ఢిల్లీలో టీటీడీ ఆధ్వర్యంలో శ్రీ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఈ బ్రహ్మోత్సవాలలో పాల్గొనవలసిందిగా రాష్ట్ర విద్య మరియు ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్‌ని, అలాగే నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిని ఢిల్లీ టీటీడీ స్థానిక సలహా మండలి చైర్మన్ వై.సుమంత్‌రెడ్డి వ్యక్తిగతంగా కలసి ఆహ్వానించారు.

# ఏడాదిలోగా బీసీ భవన్ నిర్మిస్తాం!

## రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు స్పష్టీకరణ



మహాత్మా జ్యోతిరావు పూలే స్మృతికి నివాళులర్పిస్తున్న ఎంపీ బీద మస్తాన్‌రావు

నెల్లూరు నగరంలో బీసీ భవన్ నిర్మాణాన్ని ఏడాదిలోగా పూర్తిచేయిస్తామని రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు (బీఎంఆర్) స్పష్టం చేశారు. ఇటీవల బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో, స్థానిక కలెక్టరేట్‌లో జరిగిన మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, నాటి సమాజంలో కుల వివక్ష, అసమానతలను రూపుమాపేందుకు పూలే చేసిన పోరాటం చిరస్మరణీయమన్నారు. అనంతరం, బీసీ భవన్ నిర్మాణానికి తన ఎంపీ నిధుల నుంచి 1.25 కోట్ల రూపాయలను మంజూరుచేస్తూ, జేసీ మొగిలి వెంకటేశ్వర్లుకు లేఖను అందజేశారు. తొలుత, పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆ తర్వాత నగరంలోని పూలే దంపతుల విగ్రహాలకు పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఆర్టీసీ జోనల్ ఛైర్మెన్ సురేష్ రెడ్డి, బీసీ సంక్షేమ అధికారిణి వెంకట లక్ష్మమ్మ, బీసీ కార్పొరేషన్ ఇ.డి నిర్మల, బీసీ నాయకులు బూదాటి రాధయ్య, చెంచలబాబుయాదవ్ పాల్గొన్నారు.

బిఎంఆర్ ట్రస్ట్ ద్వారా కూడా సమాజానికి ఉపయోగపడే అనేక కార్యక్రమాలను చేపడుతున్నామని బీద మస్తాన్‌రావు చెప్పారు. త్వరలోనే వివిధ రకాల స్కీముల ద్వారా పలు పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేందుకు ఆసక్తి గల యువతకు అవగాహన కల్పిస్తూ, జీవితంలో వారు నిలదొక్కుకునేలా ఆర్థిక సహాయం కూడా అందిస్తామని ప్రకటించారు.

# ఇంటర్‌లో 'కృష్ణచైతన్య' విజయభేరి!



ఈనెల 15న విడుదలైన జూనియర్ మరియు సీనియర్ ఇంటర్ ఫలితాలలో అన్ని గ్రూపులలో తమ కళాశాల విద్యార్థులు సత్తా చాటారని కృష్ణచైతన్య విద్యాసంస్థల డైరెక్టర్ ఆర్.వి.కృష్ణారెడ్డి తెలిపారు. అన్ని గ్రూపులలో స్టేట్ టాప్ మార్కులు సాధించడం కృష్ణచైతన్య విద్యాసంస్థల ప్రత్యేకత అని డైరెక్టర్ రానా ప్రమోద్‌రెడ్డి పేర్కొన్నారు. జూనియర్ ఎంపీసీ విభాగంలో జి.ఛాయశృతి, యన్.చరణి 470 మార్కులకు గాను 466 మార్కులు సాధించి స్టేట్ టాపర్స్‌గా నిలవగా, యమ్.వెంకటధర్మేంద్ర, కె.ప్రవీణ్ కుమార్, కె.వి.వి.ఓంకారేశ్వర్, కె.హిమవర్షిణి, పి.సాత్విక్ 465 మార్కులు సాధించారని తెలిపారు. జూనియర్ ఎంఇసి విభాగంలో యన్.గాయత్రి 500 మార్కులకు గాను 495 మార్కులు సాధించి స్టేట్ ఫస్ట్ మార్క్ సాధించిందన్నారు. జూనియర్ సిఇసి విభాగంలో పి.మీనాక్షి 500 మార్కులకు గాను 492 మార్కులు సాధించి స్టేట్ టాపర్‌గా నిలిచిందన్నారు. జూనియర్ బైపీసీ విభాగంలో కె.చక్రధర్ 455 మార్కులకు గాను 446 మార్కులు సాధించి స్టేట్ టాపర్‌గా నిలిచాడని, అలాగే కె.ప్రసన్నలక్ష్మీ 444 మార్కులు సాధించిందని పేర్కొన్నారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో వి.వర్షిత 1000 మార్కులకు గాను 991 మార్కులు సాధించి స్టేట్‌టాపర్‌గా నిలవగా, పి.రవీనాలక్ష్మి 990మార్కులు సాధించిందని తెలియజేశారు. జేఇఇ-నీట్ 2026లో జాతీయ స్థాయిలో టాప్-100 ర్యాంకులను లక్ష్యంగా పెట్టుకొని విద్యార్థులకి శిక్షణ ఇస్తున్నామని, అలాగే 'నీట్' లాంగ్‌టర్మ్ కోచింగ్ ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. జూనియర్ కళాశాల డీన్ రామాంజనేయరెడ్డి, అకడమిక్ డీన్ రామ్‌గోపాల్‌రెడ్డి, అడ్మిన్ డీన్ పాయసం రమేష్ ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించారు.

# క్యాపిటల్ కెప్టెన్‌గా బాబు

(మొదటిపేజీ తరువాయి)

ఇదే క్రమంలో అమరావతికి పార్లమెంట్ సాక్షిగా చట్టబద్ధత కల్పించి ఇకపై రాజధానిని ఎవరూ కదిలించలేరన్న భరోసా ఇచ్చారు. తద్వారా నూతన నగరానికి నాందీప్రస్తావన చేసి తొలి ముందడుగు వేశారు.

### లక్ష్యాలన్నీ ఏడాదిలో పూర్తి చేసి..!


గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు ఆరు గ్యారంటీలు, అమరావతిలో క్వాంటం వ్యాలీ, విశాఖలో గూగుల్ డేటా సెంటర్, ఇతర అభివృద్ధి కార్యక్రమాలు, యువతకు ఉపాధి అవకాశాలు వంటి అంశాలపై చంద్రబాబు ప్రస్తుతం పూర్తి ఫోకస్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఎందుకంటే గతంలో జగన్ ప్రభుత్వం అన్ని వ్యవస్థలనూ విధ్వంసం చేయడం, రాష్ట్ర అభివృద్ధిని గాలికి వదిలేయడంతో ఆంధ్రుల అభివృద్ధి దాదాపు పదేళ్ళ వెనుకబడిపోయిందనే ప్రచారం సాగింది. ఈ పరిస్థితిలో మార్పు తీసుకురావడమే ధ్యేయంగా చంద్రబాబు అటు సంక్షేమం, ఇటు అభివృద్ధిని సమపాళ్లలో ముందుకు తీసుకెళ్తున్నట్లు తెలుస్తోంది. ఇదే సందర్భంలో తన లక్ష్యాలన్నింటినీ 2027 ఉగాది నాటికి పూర్తి చేసి తర్వాత తెలుగుదేశంలో కొత్త నాయకత్వానికి మార్గం సుగమం చేయాలని చంద్రబాబు భావిస్తున్నట్లు ఆ పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.

### లోకేష్‌కు నాయకత్వ బాధ్యతలు..!

ఇప్పటికే రాజకీయాల్లో లెక్కకు మిక్కిలి పదవులు దక్కించుకుని పరిపూర్ణత సాధించిన చంద్రబాబు, రాష్ట్రాభివృద్ధిని గాడిన పెట్టిన తర్వాత అటు పార్టీ పగ్గాలు, ఇటు ప్రభుత్వ పగ్గాలను కుమారుడు లోకేష్‌కు అప్పగించనున్నట్లు తెలుస్తోంది. దీనికి 2027 ఉగాదిని ముహూర్తంగా ఎంచుకున్నట్లు కనిపిస్తోంది. దీనిలో భాగంగానే లోకేష్‌కి పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ బాధ్యతలు అప్పగించారని పార్టీ వర్గాల సమాచారం. గతంలో జగన్ అనుభవ రాహిత్యం వల్ల ఇష్టారాజ్యంగా పాలన సాగించి, ఆంధ్రాను అథఃపాతానికి తీసుకెళ్లారని, మరోసారి అలాంటి పొరపాటు జరగకుండా అన్ని వ్యవస్థలనూ సర్దుబాటు చేసి, పాలనపై లోకేష్‌కు పట్టు తీసుకురావడమే కాకుండా కీలక సంస్కరణలకు దిశానిర్దేశం చేయాలని చంద్రబాబు యోచిస్తున్నట్లు తెలిసింది. తద్వారా అటు ప్రభుత్వం, ఇటు పార్టీ పరంగా యువరక్తానికి, కొత్త తరానికి అవకాశం ఇవ్వాలని ప్రణాళికలు రచిస్తున్నట్లు సమాచారం. ఇదే నిజమైతే ఇప్పటికే ఆత్మీయ సమావేశాల పేరిట అటు పార్టీ నాయకులతోనూ, అభివృద్ధి పనులు, పరిశ్రమల స్థాపన వంటి విషయాలతో అధికార గణంతోనూ సత్సంబంధాలు ఏర్పచుకున్న లోకేష్ ముఖ్యమంత్రి కావడం తథ్యంగా కనిపిస్తోంది.

### మోడీ ఆశీస్సులూ దక్కినట్లే!

ఇక తెలుగుదేశంలో పార్టీలో నాయకత్వ మార్పు, ముఖ్యమంత్రిగా లోకేష్ ఖాయం కావడానికి ప్రధాని మోదీ కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. భవిష్యత్‌లో యువతకు



ప్రాధాన్యమిచ్చేందుకు బీజేపీ నాయకత్వం ఇప్పటి నుంచి వ్యూహాలు రచిస్తున్నట్లు కనిపిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగానే బిహార్‌కు చెందిన నితిన్‌నబీన్‌కు పార్టీ అధ్యక్ష బాధ్యతలను బీజేపీ పెద్దలు కట్టబెట్టారు. ఇదే క్రమంలో ఎన్డీయే మిత్రపక్ష పార్టీల్లో సైతం కొత్తతరానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈ క్రమంలోనే గత 20 ఏళ్లుగా బిహార్ సీఎం పీఠాన్ని వదిలిపెట్టని నితీష్‌కుమార్‌ను ఒప్పించి మరీ రాజ్యసభకు పంపించారు. తద్వారా కొత్త సీఎంగా యువ నేత సామ్రాట్ చౌదరికి అవకాశం కల్పించారు. ఇదే తరహాలో తెలుగుదేశం పార్టీలోనూ నాయకత్వ మార్పు, ఆంధ్రాలో ప్రభుత్వాధినేత మార్పునకు మోదీ సానుకూలంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ కారణంగానే లోకేష్‌కు మునుపెన్నడూ ఇవ్వనంత ప్రాధాన్యాన్ని బీజేపీ అధిష్టానం ఇటీవల కాలంలో ఇస్తోందనే ప్రచారం సాగుతోంది. ఏదేమైనా గతంలో ఏ నేతకు దక్కని ప్రజాదరణను చంద్రబాబు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సంపాదించుకున్నారనేది నిర్వివాదాంశం. ఈనెల 20న 76వ వసంతంలోకి అడుగుపెడుతున్న ఆయన కొత్తగా సాధించాల్సింది, నిరూపించుకోవాల్సింది ఏదీ లేదనడంలో కూడా అతిశయోక్తి లేదు. అయినా నిత్యం తెలుగు ప్రజల కోసం పరితపిస్తూ నవ్యాంధ్ర అభివృద్ధి కోసం అలుపూసొలుపూ లేని ప్రయాణం సాగిస్తున్నారు. ఇది మరింతగా కొనసాగి ఆంధ్రుల ఆశలు నెరవేర్చే శక్తి చంద్రబాబుకి వుండాలని ఆ పార్టీ వర్గాలతో పాటు ఆంధ్ర ప్రజలూ కోరుకుంటున్నారు. ఇక జన్మదినోత్సవ కానుక అన్నట్లుగా సీఎం చంద్రబాబుకు ఎకనమిక్ టైమ్స్ పత్రిక ప్రతిష్టాత్మకమైన "బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ది ఇయర్" అవార్డును ప్రకటించడం తెలుగుదేశం శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నింపుతోంది. ఈనెల 25న ముంబైలో చంద్రబాబు ఈ అవార్డును అందుకోనున్నట్లు తెలిసింది.

ఆంధ్రా ముఖ్యమంత్రి చంద్రబాబుకి జన్మదిన శుభాకాంక్షలు...!

# మొగ్గు మోడీ వైపే!

(మొదటిపేజీ తరువాయి)

దేశంలో గత పుష్కరకాలంగా మోడీ మేనియా కొనసాగుతున్న విషయం తెలిసిందే. 2014లో యూపీఏ ప్రభుత్వాన్ని గద్దెదింపి ఎన్డీయే సర్కారు ఢిల్లీ పీఠాన్ని అధిరోహించింది. అప్పటి మొదలు మూడుసార్లు మోడీ నేతృత్వంలో వరుసగా హ్యాట్రిక్ విజయాలతో హస్తినను ఏకఛత్రాధిపత్యంగా బీజేపీ ఏలుతోంది. అదే సమయంలో రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లోనూ కమలం హవా కొనసాగుతోంది. మోడీకి తోడుగా.. అమిత్ షా, జేపీ నడ్డా, రాజనాథ్ సింగ్ వంటి నేతలు ఆయా రాష్ట్రాల్లో బీజేపీ గెలుపులో కీలక భూమిక పోషిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో దేశం మొత్తం దాదాపు కాషాయమయంగా మారిన పరిస్థితి కనిపిస్తోంది. అయితే పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ, తమిళనాడులో స్టాలిన్, కేరళలో వామపక్ష నాయకులు మాత్రం బీజేపీ ప్రభంజనానికి అడ్డు నిలిచి ప్రాంతీయ శక్తులుగా తమ స్థానాలను నిలబెట్టుకున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో వచ్చిన ఐదు రాష్ట్రాల ఎన్నికలు అటు ఎన్డీయే, ఇటు ఇండియా కూటమికి ప్రతిష్టాత్మకంగా మారాయి. ఎలాగైనా మరోసారి బీజేపీని చావుదెబ్బ కొట్టాలని ప్రాంతీయ పార్టీలు సర్వశక్తులు ఒడ్డుతున్నాయి. వీరికి కాంగ్రెస్ సహాయకారిగా ఉంటూ పోటీని రక్తిగట్టిస్తోంది. ఇంకోవైపు ఎలాగైనా ఈసారి బెంగాల్, తమిళనాడు, కేరళలో పాగా వేయాలని కమలం పార్టీ ఎత్తులకు పై ఎత్తులు వేస్తూ ప్రచార పర్వంలో దూసుకుపోతోంది.

### తమిళనాడులో ఎన్డీయే కూటమి ముందంజ?

మన సరిహద్దు రాష్ట్రం తమిళనాడులో ఎన్నికలు ఎప్పుడూ ప్రత్యేకమే. అక్కడ దశాబ్దాలుగా ప్రాంతీయ పార్టీలైన డీఎంకే, అన్నాడీఎంకేదే హవా. అయితే, తమిళ దిగ్గజనాయకులైన ఎంజీఆర్, కరుణానిధి, జయలలిత కనుమరుగైన తర్వాత అక్కడ రాజకీయ శూన్యత ఏర్పడిందనే చెప్పాలి. ఈ శూన్యతను సొమ్ము చేసుకునేందుకు విజయకాంత్, కమల్‌హాసన్ వంటి సినిమా స్టార్లు రాజకీయ పార్టీలు స్థాపించారు. అయితే పెద్దగా ప్రభావం చూపలేకపోయారు. ఇక సూపర్ స్టార్ రజనీకాంత్ పార్టీ ఏర్పాటు విషయంలో ఏళ్ల తరబడి నాన్చుడి ధోరణి అవలంభించి చివరికి రాజకీయాలు తనకు సరిపడబోవంటూ చేతులెత్తేశారు. ఇక ఇళయ దళపతిగా సినీరంగంలో చక్రం తిప్పిన హీరో విజయ్ టీవీకే పార్టీని ఏర్పాటు చేసి తొలిసారి ఎన్నికల బరిలో దిగారు. అలాగే డీఎంకే నేతృత్వంలో దాదాపు కాంగ్రెస్ సహా 20వరకు చిన్నాచితకా పార్టీలు భారీ కూటమిగా ఏర్పడి మరోసారి అధికారాన్ని చేజిక్కించుకోవాలని ప్రచారంలో దూసుకెళ్తున్నాయి. మరోవైపు జయలలిత మరణం తర్వాత మూడు ముక్కలైన అన్నాడీఎంకే అస్థిత్వం కోసం పోరాడుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి, ప్రతిపక్ష నేత యడపాడి పళనిస్వామితో బీజేపీ పొత్తు తమిళనాట కొత్త రాజకీయ సమీకరణలకు బీజం వేసింది. ఫలితంగా అక్కడ ఎన్డీయేకు గొప్ప మద్దతు లభించినట్లయ్యింది. ఈ నేపథ్యంలో తమిళగడ్డపై ఈసారి పాగా వేసే అవకాశాన్ని వదులుకోకూడదని మోడీ నిర్ణయించినట్లు సమాచారం. అందుకే అక్కడ పెద్ద ఎత్తున కేంద్ర ప్రభుత్వ పథకాలకు శంకుస్థాపనలు చేయడంతో పాటూ తాము అధికారంలోకి వస్తే చెన్నై నగరంలో పురుషులకు సైతం ఫ్రీబస్, జాతీయ విద్యా విధానం అమలు, కొత్త పరిశ్రమలకు ప్రోత్సాహం, ఎంఎస్ఎంఈలకు రూ. 50 లక్షల వరకు రుణసాయం వంటి హామీలతో ప్రచారంలో దూసుకెళ్తున్నారు. ముఖ్యంగా బీజేపీ అభ్యర్థులు పోటీ చేస్తున్న 27 స్థానాలపై మోడీ.. దృష్టి కేంద్రీకరించి బహిరంగ సభలు, రోడ్ షోలతో ప్రచారాన్ని రక్తిగట్టిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రతిసారీ ఎన్నికల్లో ప్రభుత్వాన్ని మార్చే అలవాటు ఉన్న తమిళనాడు ప్రజలు ఈసారి కూడా అధికార డీఎంకేను కాదని, అన్నాడీఎంకే, బీజేపీ కూటమి మద్దతు పలికే అవకాశాలు కనిపిస్తున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. పలు ప్రధాన సంస్థలు చేపట్టిన సర్వేల్లో సైతం ఈ దఫా తమిళనాడులో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పాటయ్యే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయని ఉద్ఘాటిస్తున్నాయి. ఇక్కడ మొత్తం 234 నియోజకవర్గాల్లో మేజిక్ ఫిగర్ 118 కాగా అన్నాడీఎంకే, బీజేపీ కూటమికి 130 నుంచి 135 సీట్లు వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. తద్వారా తమిళనాట తొలిసారి కమల వికాసం ఖాయమనే సంకేతాలు కనిపిస్తున్నాయి. ఇదే జరిగితే దక్షిణాదిన గతంలో కర్ణాటక, ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ తర్వాత బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేసే మూడో రాష్ట్రంగా తమిళనాడు నిలుస్తుంది. ఇక ఇక్కడ ఎన్డీయే గెలుపునకు డీఎంకే అధినేత స్టాలిన్ నేతృత్వంలోని కుటుంబ పాలన, మంత్రుల అవినీతి, ప్రభుత్వ శాఖల్లో కుంభకోణాలు వంటి అంశాలు కూడా కారణమయ్యే అవకాశాలున్నట్లు విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. అలాగే కొత్తగా వచ్చిన విజయ్ పార్టీ 5 నుంచి 10 స్థానాలకు పరిమితమయ్యే అవకాశం ఉందని ఆ పార్టీ కూడా అవసరమైతే ఎన్డీయేతో కలసి ప్రభుత్వ ఏర్పాటుకు ముందుకొచ్చే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయని పొలిటికల్ పండితులు భావిస్తున్నారు.

### అస్సాం, పుదుచ్చేరిలోనూ విజయపతాకం ఖాయం..!

ఇక ఈశాన్య రాష్ట్రం అస్సాంలో బీజేపీ హవా స్పష్టంగా కనిపిస్తున్నట్లు సర్వే సంస్థలు అంచనా వేస్తున్నాయి. గత రెండు ఎన్నికల్లో ఎన్డీయే పార్టీలు ఇక్కడ ప్రభంజనమే సృష్టించాయి. సీఎం హేమంత బిశ్వశర్మ నేతృత్వంలో బీజేపీ నాయకులు అమిత్ త్సాహంతో పనిచేస్తున్నారు. దీంతో మొత్తం126 స్థానాల్లో గత ఎన్నికల్లో ఎన్డీయే సాధించిన 75 స్థానాల కంటే ఈసారి అధికంగా సాధించి ముచ్చటగా మరోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. కాగా కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి ఇక్కడ మరోసారి ప్రతిపక్ష పాత్రకే పరిమితమయ్యే అవకాశాలున్నాయి. ఇక కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరిలోనూ ఎన్డీయే ప్రభుత్వమే ఏర్పాటయ్యే అవకాశం కనిపిస్తోంది. ఇక్కడ రంగస్వామి నేతృత్వంలోని ఎన్ఆర్ కాంగ్రెస్‌తో బీజేపీ జతకట్టింది. వీరికి పోటీగా కాంగ్రెస్, డీఎంకే నేతృత్వంలోని ఎన్డీయే కూటమి క్షేత్రస్థాయిలో పోరాడుతోంది. అయితే మొత్తం 30 స్థానాలున్న పుదుచ్చేరిలో మరోసారి ఎన్డీయే హవా కొనసాగే అవకాశాలే అధికంగా ఉన్నట్లు తెలుస్తోంది. సీఎం రంగస్వామి నిరాడంబరత, సంక్షేమ పథకాలు మరోసారి తమకు అధికారాన్ని అందిస్తాయని ఎన్డీయే నాయకులు భావిస్తున్నారు. ఇక విజయ్ పార్టీ టీవీకే మొత్తం 30 స్థానాల్లో అభ్యర్థులను నిలిపి ఉనికి చాటుకునేందుకు యత్నిస్తోంది.

### కేరళలో వామపక్ష యుద్ధం...!

మరో దక్షిణాది రాష్ట్రం కేరళలో మాత్రం బీజేపీకి ఈసారి కూడా మొండిచెయ్యే అన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి. ఇక్కడ దశాబ్దాలుగా పోరాడుతున్న సీఎం పినరయి విజయన్ నేతృత్వంలోని ఎల్డీఎఫ్, కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ మధ్యే ఈ సారి కూడా పోటీ ఉండనుంది. కాగా ప్రస్తుత పరిస్థితుల్లో కాంగ్రెస్‌కు విజయపతాకం ఎగురవేసేందుకు కనిపిస్తున్న ఏకైక రాష్ట్రం కేరళ మాత్రమే అంటే అతిశయోక్తి కాదేమో. ఇక్కడ మొత్తం 140 స్థానాలుండగా మెజారిటీ స్థానాల్లో యూడీఎఫ్ జయకేతనం ఎగురవేసే అవకాశం ఉందని భావిస్తున్నారు. దీంతో ఇక్కడ మరోసారి బీజేపీకి రిక్తహస్తాలే మిగలవచ్చని సమాచారం. ఇక బెంగాల్‌లో మమతా బెనర్జీ హవాను అడ్డుకోవాలని బీజేపీ శతవిధాలా ప్రయత్నిస్తోంది. గతంలో మూడుసార్లు దీదీ చేతిలో చావుదెబ్బతిన్న కమలం పార్టీ ఈసారి నువ్వానేనా అన్నట్లుగా తలపడుతోంది. సర్ పేరుతో చేపట్టిన సర్వే ఇక్కడ అధికార ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధానికి కారణమైంది. అలాగే తృణమూల్ కాంగ్రెస్‌పార్టీలో అంతర్గత విభేదాలు, కుంభకోణాలు, మంత్రుల అవినీతి కార్యకలాపాలు, రాష్ట్రంలో శాంతిభద్రతల క్షీణత ముఖ్యంగా మహిళలపై వరుస అఘాయిత్యాలు మమతాబెనర్జీ పార్టీకి తలనొప్పిగా మారాయి. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వ వ్యతిరేక ఓటు చేజారిపోకుండా ఒడిసి పట్టాలని, తద్వారా దీదీ కోటను బద్దలుకొట్టాలని మోదీ నేతృత్వంలోని బీజేపీ పెద్దఎత్తున వ్యూహాలు రచిస్తోంది. ఇక బెంగాల్‌లో వామపక్ష పార్టీలు, కాంగ్రెస్ నామమాత్రంగా మారడంతో అక్కడి ప్రజలకు టీఎంసీ తర్వాత బీజేపీ ఏకైక ప్రత్యామ్నాయంగా మారింది. దీంతో ఎలాగైనా ఈ అవకాశాన్ని జారవిడుచుకోకూడదని కమలం పార్టీ పెద్దలు సామదాన భేద దండోపాయాలతో ప్రచారంలో అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ బూత్‌స్థాయి నుంచి పార్టీ బలోపేతంపై దృష్టి సారించారు. ఈనేపథ్యంలో ఈసారి టీఎంసీ, బీజేపీ మధ్య హోరాహోరీ పోరు తప్పదని, సాధించే సీట్ల విషయంలోనూ పెద్దగా తేడా ఉండబోదనే ప్రచారం జోరుగా సాగుతోంది. మొత్తం 294 నియోజకవర్గాలున్న బెంగాల్‌లో ప్రస్తుతం స్వల్ప మొగ్గు మమతాబెనర్జీ పార్టీకే ఉన్నా, చివరిక్షణం వరకు గెలుపుగుర్రం ఎక్కేదెవరో కచ్చితంగా చెప్పలేని పరిస్థితి నెలకొంది. ఒకవేళ పోటాపోటీ మెజారిటీతో టీఎంసీ గెలిచినా కేంద్రంలోని మహాశక్తి మోడీ ప్రభుత్వ వ్యతిరేకతను తట్టుకుని అది ఎన్నాళ్లు మనుగడ సాగిస్తుందో కచ్చితంగా చెప్పలేని పరిస్థితి రావచ్చనే ఊహాగానాలూ వినిపిస్తున్నాయి. ఏదేమైనా రసవత్తరంగా మారిన ఐదురాష్ట్రాల ఎన్నికల్లో తమిళనాడు, పుదుచ్చేరి, అస్సాంలలో కమల వికాసం తథ్యమనే సంకేతాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. బెంగాల్ పరిస్థితి నెక్ టూ నెక్ అనేలా ఉన్నా బీజేపీకి సీట్లు గణనీయంగా పెరగడం మాత్రం ఖాయంగా కనిపిస్తోంది. అదే జరిగితే నరేంద్ర మోడీ పేరు దేశంలో మరింతగా మారుమోగిపోవడం ఖాయంగా కనిపిస్తోంది. మరి ఓటర్ల తీర్పు విశ్లేషకుల అంచనాలకు అందుతాయా లేక షాకిస్తాయా..? అనే విషయం త్వరలో తేలిపోనుంది...!

# కళ్యాణ వైభవం...!




నుడా మాజీ చైర్మెన్ ముక్కాల ద్వారకనాథ్ - ఆదిలక్ష్మిల కుమారుడు
ప్రేమ్ చందన్ - లక్ష్మీ ప్రణవి (నెల్లూరు వాస్తవ్యులు పోకూరి మాలకొండయ్య - మాధవిల కుమార్తెల
వివాహం ఏప్రిల్ 12వ తేదీ నెల్లూరుజిల్లా, మైపాడు వద్దగల సముద్ర' రిసార్ట్స్‌లో వైభవంగా జరిగింది.
కొత్త జంటకి 'లాయర్' శుభాకాంక్షలు.

# వింజమూరులో అన్నా క్యాంటిన్



'అన్నా క్యాంటిన్'లో భోజనం చేస్తున్న అబ్దుల్ అజీజ్, కాకర్ల సురేష్ తదితర నాయకులు

వింజమూరు పట్టణంలోని బంగ్లా సెంటర్ వద్ద కొత్తగా ఏర్పాటు చేసిన అన్నా క్యాంటీన్‌ను ఈనెల 15న ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్, రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అన్నా క్యాంటీన్లంటే పేదల ఆకలి తీర్చే 'అన్నపూర్ణ' లాంటివన్నారు. ఆకలితో బాధపడుతున్న నిరుపేదల ఆకలి తీర్చడమే ఈ క్యాంటీన్ల ఉద్దేశ్యమన్నారు. కూటమి ప్రభుత్వం అత్యంత తక్కువధరతోనే పేదలకు నాణ్యమైన భోజనం అందజేస్తుండడం సంతోషకరమన్నారు. నిరుపేదలు, దినసరి కూలీలు, కార్మికులు, అలాగే పేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు, సామాన్య ప్రజలకు ఇవి ఎంతగానో ఉపయోగపడుతున్నాయన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నా క్యాంటిన్లను పేదలకు అందుబాటులోకి తీసుకువచ్చి వారికి మహోపకారం చేస్తున్నారని వారు కొనియాడారు.




# మహామేధావి.. డా. అంబేద్కర్!

## • జయంతి సందర్భంగా కొనియాడిన జిల్లా నేతలు

*భారత రాజ్యాంగ నిర్మాత, మహామేధావి డా.బాబాసాహెబ్ అంబేద్కర్ 135వ జయంతిని ఈ నెల 14న జిల్లావ్యాప్తంగా పలు సంఘాల వారు, బడుగు బలహీనవర్గాల నాయకులు, అధికారులు, అనేక సేవాసంస్థల వారు ఉత్సాహంగా జరుపుకున్నారు.*



### దేశానికి దిక్సూచి - మంత్రి రామనారాయణరెడ్డి

రాజ్యాంగ నిర్మాత డా.బాబాసాహెబ్ చూపిన సమానత్వం, సామాజిక న్యాయమార్గమే దేశానికి దిక్సూచిలని రాష్ట్రదేవాదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. ఈనెల 14న డా.అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆత్మకూరులో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, ఆయన సేవలను తలచుకున్నారు.

### రాజ్యాంగమే దేశానికి రక్ష - మంత్రి నారాయణ

డా. అంబేద్కర్ రాజ్యాంగమే దేశానికి రక్ష అని, దేశంలోని ప్రతిపౌరునికి సమానహక్కులు, గౌరవం లభిస్తున్నాయంటే అదంతా రాజ్యాంగం వల్లనేనని రాష్ట్ర పురపాలకమంత్రి డా. పొంగూరు నారాయణ చెప్పారు. తన సతీమణి రమాదేవితో కలసి ఆయన హైదరాబాద్‌లోని తమ నివాసంలో డా.అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు సమర్పించి అంజలి ఘటించారు.



### సమసమాజ స్వాప్నికులు - ఎంపీ వేమిరెడ్డి

సమసమాజ స్వాప్నికులు డా. అంబేద్కర్ అని, అంటరానితనం, అసమానతలు లేని సమాజ స్థాపనే ఆ మహనీయుని ఆశయమని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా నెల్లూరు నగరంలోని తమ కార్యాలయంలో ఆయన అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.



### బడుగువర్గాలకు బాసట - ఎమ్మెల్యే సోమిరెడ్డి

భారత రాజ్యాంగ రూపశిల్పి డా. అంబేద్కర్, బడుగు బలహీన వర్గాల వారికి సమానహక్కులు కల్పించిన మహోన్నత వ్యక్తి అని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చెప్పారు. నెల్లూరు వీఆర్‌సి సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి ఆయన సేవలను జ్ఞాపకం చేసుకున్నారు.



### దేశం గర్వించదగిన మేధావి - ఎమ్మెల్యే కోటంరెడ్డి

డా. అంబేద్కర్ దేశం గర్వించదగిన మహామేధావి, భరత మాత ముద్దుబిడ్డ అని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి చెప్పారు. వెంగళరావునగర్‌లో ఆయన డా.అంబేద్కర్ పేరుతో నిర్మించిన కమ్యూనిటీహాల్‌ను ఈనెల 14న ప్రారంభించారు.



### మహిళలకు ప్రత్యేక హక్కులు - ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

దేశంలో మహిళలకు ప్రత్యేక హక్కులు కల్పించిన రాజ్యాంగవేత్త డా. బిఆర్ అంబేద్కర్ అని, వారి కృషి వల్లే నేడు భారత దేశంలో మహిళలు ప్రత్యేక హక్కులు పొంద గలుగుతున్నారని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చెప్పారు. డా. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని బుచ్చిరెడ్డి పాళెంలో నిర్వహించిన ర్యాలీలో ఆమె మాట్లాడుతూ, అంబేద్కర్ ఆశయసాధనకు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.



### దార్శనికులు - ఎమ్మెల్యే కాకర్ల

వింజమూరు బంగ్లా సెంటర్‌లో జరిగిన అంబేద్కర్ జయంతి కార్యక్రమంలో ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ మాట్లాడుతూ, భారత రాజ్యాంగ నిర్మాణంలో అద్భుతపాత్ర పోషించిన మహామేధావి, దార్శనికుడు అంబేద్కర్ అంటూ కీర్తించారు.



### మానవీయమూర్తి - చిట్టమూరు ప్రవీణ్‌రెడ్డి

డా.అంబేద్కర్ మానవీయమూర్తి అని, సామాజిక న్యాయయోధుడని జనసేన సీనియర్ నాయకుడు చిట్టమూరు ప్రవీణ్‌రెడ్డి కొనియాడారు. స్వేచ్ఛ-సమానత్వం- సౌభ్రాతృత్వం అనే మూలసూత్రాలతో ఆయన రాజ్యాంగానికి రూపకల్పన చేశారన్నారు. విఆర్‌సి కూడలిలోని డా. అంబేద్కర్ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి అంజలి ఘటించారు.



# వేదగిరీశునికి 18 లక్షల ఆదాయం



హుండీ కానుకలను లెక్కిస్తున్న ఆలయ అధికారులు, సిబ్బంది

నెల్లూరు రూరల్ మండలంలోని నరసింహకొండపై వెలసిన శ్రీ వేదగిరి లక్ష్మీనృసింహస్వామి దేవాలయంలో గత 5 నెలలకు సంబంధించి భక్తులు సమర్పించిన కానుకల ద్వారా హుండీ రాబడి 18 లక్షలా 2వేలా 375 రూపాయలు వచ్చింది. ఈనెల 15న హుండీలను లెక్కించగా, ఆ డబ్బుతో పాటు 11.500 గ్రాముల బంగారు, 20 గ్రాముల వెండి వస్తువులు కూడా హుండీల ద్వారా లభించాయి. ఆలయ ఛైర్మెన్ అచ్యుతశంకర్‌రెడ్డి, ఇఓ వేమూరి గోపి, దేవాదాయ శాఖ అధికారి సిహెచ్ శ్రీనివాసబాబు, అర్చకులు భాస్కరాచార్యులు తదితరులు ఈ లెక్కింపును పర్యవేక్షించారు.

# జొన్నవాడ బ్రహ్మోత్సవాలు.. మే 7 నుంచి



జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బుచ్చిరెడ్డిపాళెం మండలం జొన్నవాడలోని శ్రీ మల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి అమ్మవారి ఆలయంలో మే నెల 7వ తేదీ నుంచి అంగరంగ వైభవంగా బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. ఆమేరకు ఈనెల 15న ఆలయంలో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఈ ఉత్సవాల గోడప్రతులను ఆవిష్కరించారు. మే 7 నుంచి 17వ తేదీ వరకు జరిగే ఈ బ్రహ్మోత్సవాలకు వేలసంఖ్యలో భక్తజనం తరలివస్తారు కనుక, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని ఆమె అధికారులకు సూచించారు. ఆలయ ఛైర్మెన్ తిరుమూరు అశోక్‌రెడ్డి, కార్యనిర్వహణాధికారి అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మెట్టప్రాంత అభివృద్ధి ప్రదాత.. పొన్నెబోయిన

- నివాళులర్పించిన ఎమ్మెల్యే కాకర్ల, ఎమ్మెల్సీ బీద



చెంచురామయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర

మెట్ట ప్రాంత అభివృద్ధి ప్రదాత..ఉదయగిరి నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు స్వర్గీయ పొన్నెబోయిన చెంచురామయ్య 23వ వర్ధంతి కార్యక్రమం ఈనెల 13న జిల్లా ప్రజాపరిషత్ మాజీ ఛైర్మన్ చెంచల బాబుయాదవ్ ఆధ్వర్యంలో గండిపాలెం ప్రాజెక్టు ప్రాంగణంలో జరిగింది, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్..ఆయన సతీమణి ప్రవీణ, టీడీపీ జిల్లా అధ్యక్షులు.. ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, పలువురు టీడీపీ నేతలు పాల్గొని చెంచురామయ్య చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గండిపాళెం ప్రాజెక్టు కోసం అప్పట్లో చెంచురామయ్య చేసిన కృషిని వారు కొనియాడారు. గండిపాలెం ప్రాజెక్ట్ 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ ప్రాజెక్ట్‌కు విశేష సేవలు అందించిన మహనీయుడు చెంచురామయ్య స్మారకార్థం నూతన విగ్రహ నిర్మాణానికి వారు శంకుస్థాపన చేశారు. అనంతరం కాకర్ల సురేష్ మాట్లాడుతూ, అప్పటి పరిస్థితుల్లోనే రైతుల కష్టాలను గుర్తించి, 16వేల ఎకరాల ఆయకట్టుకు నీరు అందించాలనే లక్ష్యంతో 1.88 టీఎంసీల సామర్థ్యంతో ఈ ప్రాజెక్ట్ నిర్మాణానికి పొన్నెబోయిన చేసిన కృషి చిరస్మరణీయమని తెలిపారు. ఈ జలాశయం ద్వారా 21 గ్రామాలకు నీరు అందుతూ కరువు సమస్యకు శాశ్వత పరిష్కారం లభించిందని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్ట్ పూర్తిస్థాయి ప్రయోజనం అందించేందుకు సీఎంకి విన్నవించామని పేర్కొన్నారు.

# 17న..చమత్కార సాహిత్య సౌరభం

నెల్లూరులోని చేతన సంగీత సాహిత్య సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో ఈనెల 17వ తేదీ సాయంత్రం 6.30 గంటలకు స్థానిక వర్ధమాన సమాజం (టౌన్‌హాల్)లో 'చమత్కార సాహిత్య సౌరభం' అనే అంశంపై ఉపన్యాసం ఉంటుందని, సాహిత్యాభిమానులు పాల్గొని సభను విజయవంతం చేయాలని చేతన నిర్వాహకులు డా. ఎం.సుబ్రహ్మణ్యం, వై.శేషగిరీశం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సభలో భాషాప్రవీణ, రేపల్లెకి చెందిన ఎం.కృష్ణ కిశోర్ ప్రసంగిస్తారని, కేంద్ర సాహిత్య అకాడెమీ బాలసాహిత్య పురస్కార గ్రహీత డా. గంగిశెట్టి శివకుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొంటారని వారు పేర్కొన్నారు.

## టూకీగా...



### ఆత్మకూరులో అగ్నిమాపక వారోత్సవాలు

ఆత్మకూరులో ఈనెల 15న అగ్నిమాపకశాఖ వారోత్సవాలు నిర్వహించి, అగ్నిప్రమాదాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. ఈ అవగాహన కార్యక్రమాలలో అగ్నిమాపక అధికారి పి.బాలాజీ, గురుప్రసాద్, ఎల్ఎఫ్ కె.శ్రీనివాసులు, ఫైర్‌మ్యాన్ ఎం. ఇమాన్యుయేల్, రమేష్, వెంకటేశ్వర్లు, ఆర్టీసీ డిపో సూపరింటెండెంట్ బాబురావు పాల్గొన్నారు.

### మర్రిపాడులో రైతులకు అవగాహన

సంగం మండలం మర్రిపాడులో రైతులకు అధిక యూరియా వాడకం వల్ల జరిగే అనర్ధాలపై వ్యవసాయ అధికారులు ఈనెల 15న అవగాహన కలిగించారు. మండల వ్యవసాయాధికారి శశిధర్, సొసైటీ డైరెక్టర్లు జనార్దన్‌రెడ్డి, శ్రీహరిరెడ్డి తదితరులు పాల్గొని పంటపొలాల్లో చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు.

### ఏఎస్‌పేట ఆరోగ్య కేంద్రం తనిఖీ

మండల కేంద్రమైన ఏఎస్‌పేటలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ వి.సుజాత ఈనెల 15న ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ కేంద్రంలో రోగులకు అందుతున్న ఆరోగ్యసేవల వివరాలపై ఆరా తీశారు. రికార్డులు పరిశీలించి, సిబ్బందికి తగు సూచనలు చేశారు. అనంతరం ఆరోగ్యసిబ్బందితో సమీక్ష నిర్వహించారు.

### కొత్తూరులో జనాభా గణనపై శిక్షణ

ఇందుకూరుపేట మండలం కొత్తూరులో ఈనెల 15న జనాభా గణనపై సిబ్బందికి అధికారులు శిక్షణ ఇచ్చారు. కలెక్టర్ ఆదేశాలతో కలెక్టర్ కార్యాలయం డీఏఓ శ్యాం, సూపరింటెండెంట్ అశోక్‌లు పాల్గొని జనాభా గణన పటిష్టంగా జరగాలని సిబ్బందికి సూచించారు. తహశీల్దార్ మురళి, ఎంపీడీఓ నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

### బుజబుజనెల్లూరులో 'పోషణ్ పక్వాడ'


నెల్లూరు రూరల్ మండలంలోని బుజబుజనెల్లూరు అంగన్‌వాడీ కేంద్రంలో సూపర్‌వైజర్ స్వరూప ఆధ్వర్యంలో 'పోషణ్ పక్వాడ' కార్యక్రమం నిర్వహించి పోషకాహార పదార్ధాల ప్రాముఖ్యతను గర్భవతులకు, పిల్లల తల్లులకు తెలియజేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు నాగభూషణమ్మ, హారతి, సుజాత, హెల్పర్ కుమారి, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

### సంగంలో ఫైలేరియా వ్యాధిగ్రస్తులకు కిట్‌లు

మండలకేంద్రమైన సంగం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఫైలేరియా వ్యాధిగ్రస్తులకు ఆ వ్యాధి నివారణకు అవసరమైన కిట్‌లను పంపిణీ చేసి, వాటిని ఎలా ఉపయోగించుకోవాలో తెలిపారు. డాక్టర్ అశోక్‌కుమార్ పాల్గొని ఆ వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. ఆరోగ్య విస్తరణాధికారి మల్లెం కొండయ్య, ఖాదర్‌బాషా, జలీల్ పాల్గొన్నారు.

# కాలాతీత కవిత్వం.. దువ్వూరి వారి 'పానశాల'







"పురుషులందు పుణ్యపురుషులు వేరయా" అని మహాకవి వేమన అన్నట్లే కవులలో కూడా మహాకవులు వేరు. అలాంటి మహాకవి కోవలోకి చెందిన వారే మన సింహపురి కవికిశోరం..'కవికోకిల' దువ్వూరి రామిరెడ్డి. ప్రసిద్ధ కవులు నండూరి సుబ్బారావు, విశ్వనాథ సత్యనారాయణ, గుర్రం జాషువా, అడివి బాపిరాజు జన్మించిన 1895వ సంవత్సరంలోనే రామిరెడ్డి కూడా జన్మించటం యాదృచ్ఛికమే అయినా అదొక విశేషం. గూడూరులో జన్మించి, గూడూరు, పెమ్మారెడ్డి పాలెం, నెల్లూరులలో చదివినా దువ్వూరి వారు ఎనిమిదో తరగతి దాటలేకపోయారు. అక్కడితో చదువు ఆపి జీవిత అధ్యయనం ఆరంభించారు. పుట్టింది వ్యవసాయ కుటుంబంలో అయినా సాధారణ విషయాలకు భిన్నంగా విజ్ఞాన శాస్త్రం, మెకానికల్ ఇంజనీరింగ్, చిత్రలేఖనం, విగ్రహాల రూపకల్పన, జ్యోతిష్య శాస్త్రం మీద ఆయనకి ఎందుకనో ఆసక్తి కలిగింది. ఆయా రంగాల్లో ఆయన అనితర సాధ్యమైన ప్రతిభతో రాణించడం ఒక అద్భుతం.

నవ్యకవిత్వ యుగంలో తనకంటూ ఒక ప్రత్యేక ముద్ర వేసుకున్న మహాకవి దువ్వూరి రామిరెడ్డి అని తెలుగువారంతా గర్వంగా చెప్పుకోవచ్చు. ఆయన కవిత్వం గ్రామీణ జీవన సౌందర్యాన్ని, కర్షకుని కష్టాన్ని, ప్రకృతి రమణీయతను అద్దం పడుతుంది. అందుకే ఆయన "కవికోకిల'గా సార్థక నామధేయులయ్యారు. దువ్వూరి కవిత్వంలో ప్రధానాంశం వ్యవసాయం. ఆయన రాసిన "కృషీవలుడు" కావ్యం తెలుగు సాహిత్యంలో అపూర్వమైన కావ్యంగా ప్రసిద్ధి. అప్పట్లో కవులంతా రాజుల గురించి, దేవుళ్ల గురించి రాస్తుంటే, ఆయన పొలం దున్నే రైతును కథానాయకుడిగా ఎంచుకోవడం ఆయన విలక్షణ కవితా లక్షణానికి నిదర్శనం. అంతేకాదు, దువ్వూరి రామిరెడ్డి గారు రచించిన "పానశాల" ఆధునిక తెలుగు సాహిత్యంలో ఒక అపురూపమైన కావ్యం. ఇది పారశీక కవి ఉమర్ ఖయ్యాం రాసిన 'రుబాయీత్'కు స్వేచ్ఛానువాదం. అనువాదమైనప్పటికీ, ఇది తెలుగు వారి అభిరుచులకు అనుగుణంగా, సొంత కావ్యమా అన్నంత సహజంగా సాగుతుంది. పారశీక కవి ఉమర్ ఖయ్యాం రాసిన రుబాయీలను ఆంగ్లంలోకి ఎడ్వర్డ్ ఫిట్జ్‌గెరాల్డ్ అనువదించారు. ఆ ఆంగ్ల అనువాదం ద్వారా ప్రభావితమైన దువ్వూరి వారు, తెలుగు పాఠకులకు ఆ తత్వాన్ని పరిచయం చేయాలనే ఉద్దేశంతో 'పానశాల'ను రచించారు. సాధారణంగా 'పానశాల' అంటే "జీవ రసం" లేదా ఆనందం అనే తత్వ భావనను వెలుబుచ్చి, పండితుల చేత అభినందనలు అందుకున్నారు. 1928లోనే భారతి సాహిత్య మాసపత్రికలో ఈ కావ్యాన్ని ప్రచురించారు. మన శరీరం లేదా మనం అనుభవించే జీవితం క్షణభంగురమని, ఉన్న కొద్దిపాటి కాలాన్ని ద్వేషాలతో కాకుండా, ఆనందంతో, ప్రేమతో గడపాలని ఈ కావ్యం బోధిస్తుంది. ఈ కావ్యంలో లోతైన వేదాంత ధోరణి కనిపిస్తుంది.

'గడచిన కాలం తిరిగి రాదు, రేపు అన్నది మన చేతుల్లో లేదు, కాబట్టి ఈ నిముషాన్ని సంతోషంగా అనుభవించు' అనే సందేశం ప్రతి పద్యంలోనూ ధ్వనిస్తుంది. మట్టి పాత్రలు చేసే కుమ్మరిని దేవుడితో పోలుస్తూ, మనం ఆ విధి చేతిలో మట్టి బొమ్మలమేనని ఆయన చమత్కరిస్తారు. పారశీక భావాలకు తెలుగు జాతీయాలను, నుడికారాలను జోడించి అచ్చతెలుగు కావ్యంగా మార్చారు. "నిన్నటి దినము గతించి పోయినది, రేపటి సంగతి ఎవరికి తెలుసు? నేటి ఈ మధుర క్షణమే నీది. దీనిని వృధా చేయకు." అనే భావనలు పానశాల నిండా మనం ఆస్వాదించవచ్చు. ఈ కావ్యం ఎంత ప్రసిద్ధి పొందిందంటే, దీని ప్రభావంతో తెలుగులో మరిన్ని అనువాదాలు వచ్చాయి. కానీ, రామిరెడ్డి "పానశాల"లో ఉన్న ఆర్ద్రత, భావాలలోని స్పష్టత మరెక్కడా కనిపించవు. అందుకే ఆయనను "తెలుగు ఖయ్యాం" అని కూడా కొందరు ప్రశంసిస్తారు. దువ్వూరి రామిరెడ్డి 'పానశాల' ..జీవిత సత్యాన్ని వెతికే ఒక తాత్వికుడి ప్రయాణం. విధి వైచిత్రిని, చావు పుట్టుకల రహస్యాన్ని, ప్రేమలోని మాధుర్యాన్ని అద్భుతంగా ఆవిష్కరించిన కావ్యం ఇది. పానశాల జీవితం యొక్క అశాశ్వతతను, వర్తమాన క్షణాన్ని అనుభవించాలనే సందేశాన్ని ఇస్తుంది. ఒక్కమాటలో చెప్పాలంటే, 'పానశాల' కేవలం ఒక అనువాదం కాదు, అదొక తపస్సు. పారశీక పరిమళాలను తెలుగు తోటలోకి తెచ్చి, మన మనసులకి అద్దేలా ఆయన చేసిన కృషి తెలుగు సాహిత్యంలో చిరస్థాయిగా నిలిచిపోతుంది. 2026 సంవత్సరానికి పానశాల వెలువడి నూరేళ్ళు నిండినా నేటికీ ఆ వన్నె, వేడి తగ్గని కావ్యంలా పరిమళిస్తూనే ఉంది. పానశాల వైభవం. కాలం అనే గీటురాయిపై నిలబడి, చరిత్ర పుటల్లో మరుగున పడిపోకుండా, నిరంతరం మనిషి హృదయాన్ని తట్టిలేపే అక్షర రూపంగా నిలిచే ఉంది. మరెంతోకాలం నిలిచే ఉంటుంది కూడా. ఆయనది నిజంగానే కాలాలకి అతీతమైన..కాలాతీత కవిత్వం అని అనుకోవచ్చు.

- ఈతకోట సుబ్బారావు
94405 29785




Edited, Published, Printed & Owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Managing Editor : T.BHARATHI REDDY, Sub-Editor : MADDURU SRINIVASULU. e-mail: lawyerpatrika@gmail.com